ప్రజాశక్తి

గురువారం 28 మార్చి 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు





అడుగంటుతున్న జలాశయాలు

పులిచింతలలో 4.67 టిఎంసీలకు నీటి నిల్వ - సాగర్‌లో గణనీయంగా తగ్గిన నీటి మట్టం



ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

నాగార్జునసాగర్, పులిచింతల జలాశయాల్లోనీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయి. మరోమూడు నెలల్లో పులిచింతలలో పూర్తిగా నిల్వలు పూర్తి స్థాయిలో అడుగింటిపోయే ప్రమాదం నెలకొంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ ఏడాది చాలా ప్రాంతాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి పొంచి ఉంది. ఆరు నెలలుగా సరైన వర్షాల్లేక ప్రధాన జలాశయాలలో నీటి నిల్వలు తగ్గిపోయాయి. ఎగువ నుంచి నీటి ప్రవాహం రాకపోవడం వల్ల శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల జలాశయాలు అతి తక్కువ నీటి మట్టానికి నీటి నిల్వలు తగ్గిపోయాయి.

ప్రధానంగా డెల్టా పరిధిలో 13 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు, దాదాపు 400 గ్రామాల్లో తాగునీటి అవసరాలకు ఉపయోగపడే పులిచింతల జలాశయంలో గరిష్టనీటి నిల్వ 45.77 టిఎంసిలు కాగా బుధవారం రాత్రి 4.67 టిఎంసీలకు నీటి నిల్వ పడిపోయింది. గేడాది ఇదే రోజుల్లో పులిచింతలలో నీటి నిల్వ 28 టిఎంసీలు ఉండగా ఈ ఏడాది ప్రస్తుతం 4.67 టిఎంసీలకు తగ్గింది. శ్రీశైలంలో గరిష్ట నీటి నిల్వ 215.80 టిఎంసిలు కాగా ప్రస్తుతం 35.70 టిఎంసీలు మాత్రమే ఉంది. నాగార్జున సాగర్‌లో గరిష్ట నీటినిల్వ 312.01 టిఎంసిలుకాగా

▶ 2లో

సాగర్ నీటి వినియోగంలో పొదుపు : పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : నాగార్జున సాగర్ జలాశయంలో ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. ఈ అంశమై సంబంధిత అధికారులతో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని తన క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ బుధవారం సమీక్షించారు. నీటి సరఫరాలపై గ్రామాల్లో నిత్యం పర్యవేక్షించాలని, అవసరాలకు అనుగుణంగానే సరఫరా చేయాలని చెప్పారు. వాన నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా పరిషత్ కార్యనిర్వహణ అధికారి, మండల అధికారులు, గ్రామీణ నీటి సరఫరా శాఖాధికార్లతో సమన్వయ సమావేశం నిర్వహించి పకడ్బందీగా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. మున్సిపాలిటీల వారీగా నీటి సమస్యలు అధిగమించుటకు తీసుకోవాల్సిన చర్యలను రూపొందించాలన్నారు. ఇదిలా ఉండగా సాగర్ జలాశయం మొత్తం నీటి మట్ట 590 అడుగులు కాగా ప్రస్తుతం నీరు 513 అడుగుల వద్ద ఉందని, డెడ్ స్టోరేజీ 510 అడుగులని అధికారులు వివరించారు. ప్రస్తుతం 5.8 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు చెప్పారు. సమీక్షలో గ్రామీణ నీటి సరఫరాధికారి సురేష్, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్‌రెడ్డి, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎస్ఇ వరలక్ష్మి, విద్యుత్ శాఖ అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

నడిపాలెం చెక్‌పోస్టు వద్ద కలెక్టర్, ఎస్పీ తనిఖీ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దు ప్రాంతమైన నియోజకవర్గలోని నడింపాలెం చెక్‌పోస్ట్ వద్ద జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ తుషార్ డూడి బుధవారం తనిఖీ చేశారు. కాటూరి మెడికల్ కాలేజీ సమీపంలోని జాతీయ రహదారిపై చెక్‌పోస్టు వద్ద తనిఖీల సరళిని, వాహనాలను తనిఖీ చేశారు. ఏదైనా వాహనం అనుమానాస్పదంగా కనిపిస్తే సమాచారాన్ని వెంటనే ఉన్నతాధికారులకు తెలపాలని సిబ్బందికి సూచించారు. మద్యం, నగదు అక్రమ రవాణా జరగకుండా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. అర్ధరాత్రి, తెల్లవారుజాము వేళల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(ఎల్ఒ) శ్రీనివాస్, ఎస్ డిపిఒ-సౌత్ మహబూబ్ బాషా, ప్రత్తిపాడు సిఐ నిస్సార్ బాషా, ఎస్సై సోమేశ్వరరావు పాల్గొన్నారు.

మరింతగా కేంద్ర బలగాలను కోరాం

వివాదాస్పదులను ముందుగానే ఓటేయించి అదుపులోకి తీసుకునే యోచన : జెసి

ప్రజాశక్తి - మాచర్ల



మాచర్ల నియోజకవర్గంలో 135 అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్న నేపథ్యంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిపేందుకు అవసరమైన అన్ని ప్రయత్నాలూ చేస్తున్నట్లు పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్, మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్యామ్ ప్రసాదు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శాంతి, భద్రతలను కాపాడేందుకు కేంద్ర బలగాలను కోరినట్లు తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద సిసి కెమోరాలను ఏర్పాటు చేశామని, నిఘా మరింత పెంచుతామని అన్నారు. ఇప్పటికే 1,904 లీటర్లు మద్యం, నగదు పట్టుకున్నట్లు చెప్పారు. రూ.50 వేలకు మించి నగదుతో ప్రయాణిస్తే తగిన ఆధారాలు చూపాలలని, లేకుంటే సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లఘించిన ఐదుగురు ఉద్యోగులపై వేటు వేశామని, వీరిలో నలుగురు వాలంటీర్లు, ఒక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం తరుపున విధులు నిర్వహించే వారు, ప్రభుత్వం నుండి వేతనాలు పొందే వారు

▶ 2లో

112 లీటర్ల పురుగు మందులు సీజ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలోని శ్రీవెంకట తిరుమల ఫర్టిలైజర్స్ ఎరువుల దుకాణంలో గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో అధికారులు బుధవారం తనిఖీలు చేశారు. రెండు కంపెనీలకు చెందిన ఏడు రకాల

▶ 2లో

అప్పుడు పొగిడి.. ఇప్పుడు విస్మరించి..

ఆశా కార్యకర్తల సమస్యలపై యూనియన్ వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కోవిడ్ సమయంలో ఆశాలు ప్రాణాలకు తెగించి చేసిన సేవలు మరువలేనివని పొగడ్తలతో ముంచెత్తిన ప్రభుత్వం ఇప్పుడు వారిని చేస్తోందని, అన్ని పనులకూ ఆశా కార్యకర్తలే ముందుంటున్నా వారి సమస్యలను మాత్రం పరిష్కరించడం లేదని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శివకుమారి అన్నారు. ఆశాలకు పనిభారం తగ్గించాలని, ఇతర

▶ 2లో



పల్నాడు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారికి వినతి పత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

వామపక్ష, లౌకిక శక్తులను గెలిపించాలి

బిజెపి, దానికి అంటకాగుతున్న పార్టీలను ఓడించాలి : సిపిఎం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మతోన్మాద బిజెపిని, దాని అంటకాగుతున్న టిడిపి, జనసేన, వైసిపిలను ఈ ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. మండలంలోని నిడమర్రులో సిపిఎం విస్తృత సమావేశం నాయకులు కె.వెంకటేశ్వర్లు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. రామారావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక నిత్యవసరాలు ధరలు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు విపరీతంగా పెంచారని అన్నారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్షాలు బిజెపిని సమర్థించడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రాన్ని తీవ్ర అన్యాయం చేసిన బిజెపిని భుజాన వేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా ఇస్తామని వాగ్దానం చేసిన బిజెపి మాట తప్పిందని, రాష్ట్ర అభివృద్ధికి నిధులు ఇవ్వలేదని, విశాఖ రైల్వే జోన్‌కు, కడప ఉక్కు పరిశ్రమకు, పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నిధులు ఇవ్వకుండా మోసం చేసిందని విమర్శించారు. అటువంటి బిజెపితో టిడిపి పొత్తు పెట్టుకోవడం సిగ్గుచేటన్నారు. వీరిని ఎన్నికల్లో ఓడించి వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులను గెలిపించాలని పిలుపునిచ్చారు. సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకర్ మాట్లాడుతూ మంగళగిరి ప్రాంతంలో పేదల సమస్యలపై సిపిఎం అలుపెరగని పోరాటాలు చేసిందని, వేలాది మంది పేదలకు ఇళ్ల స్థలాలు కోసం పోరాడిందని గుర్తు చేశారు. పోరాడే అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రవి మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో రైతు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై సిపిఎం నిరంతర పోరాటాలు చేస్తోందన్నారు. ఇళ్ల స్థలాలు ఎల్లపట్టాల సమస్యలపై పోరాటాలు చేసిందన్నారు. రాబోయే ఎన్నికల్లో వామపక్ష శక్తులను గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు ఎం.భాగ్యరాజు, జి.నాగేశ్వరరావు, కె.ప్రకాష్‌రావు, కె.వీరయ్య కె.నాగేశ్వరరావు, ఎం.రాజముని, కె.బుల్లెబ్బాయి, కె.నానయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామారావు



22న ఆర్మీ రిక్రూట్‌మెంట్‌కు ఆన్‌లైన్ పరీక్ష

ప్రజాశక్తి-గుంటూరు : ఇండియన్ ఆర్మీలో సోల్జర్ కేటగిరీ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల అభ్యర్థులకు ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ పరీక్ష ఏప్రిల్ 22న నిర్వహించనున్నట్లు సెప్టస్ సిఇఒ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర సమాచారం కోసం గుంటూరు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీసులో సంప్రదించాలని లేదా 0863-2230008, 2230006 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

పరీక్షలన్నీ రాశాక మృత్యువాత

2లో



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం సాయంత్రం) : 6.25

సహరీ (శుక్రవారం ఉదయం) : 4.49



కుట్టుమిషన్ అందజేస్తున్న భాష్యం ప్రవీణ్ భార్య లావణ్య

కుట్టు మిషన్ అందజేత

ప్రజాశక్తి–పెదకూరపాడు

పేద మహిళలకు కుట్టు మిషన్ ను పెదకూరపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య అందజేశారు. బుధవారం పెదకూరపాడు మండలం లోని హుస్సేనగరం గ్రామంలో మాగులూరి ఫౌం డేషన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో కుంచనపల్లి కిరణ్ మాగులూరి కృష్ణారావు , కొండవీటి ప్రసాద్ పాల్గొన్నారు.

పేటసన్నిగండ్లలో వృద్ధురాలు హత్య

ప్రజాశక్తి -కారంపూడి



మండల పరిధిలోని పేటసనిగండ్ల గ్రామ శివా రులో గల పోతురాజుగుట్ట కాలనీలో అరె.లక్ష్మమ్మ (80) అనే వృద్ధురాలుని గుర్తు తెలియని దుండగులు అతి దారుణంగా హత్య చేశారు. ఈ హత్య మంగళవారం అర్ధ రాత్రి జరిగినట్లుగా స్థానికులు భావిస్తున్నారు. ఒకరోజు మొత్తం ఆమె ఇంట్లో నుండి బయటకు రాకపోవటం తో స్థానికులు తలుపుతీసి చూడగా ఆమె చనిపోయిందని తెలిసి పోలీసులకు సమాచారం అందించటం తో స్థానిక ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన హత్య గురించి విచారిస్తున్నారు. క్లూస్ టీమ్ ని పిలి పించి పూర్తి వివరాలు తెలియజేస్తామని ఎస్ఐ తెలిపారు.



గంజాయి విక్రయిస్తున్న రాకేష్ బాబును అరెస్టు చేసిన చిత్రం

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి–మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని టిట్కో గహ సముదాయంలో గంజాయి విక్రయిస్తున్న రాకేష్ బాబును బుధవారం సాయంత్రం అరెస్ట్ చేసినట్లుగా ఎక్సైజ్ సీఐ ప్రసన్నలక్ష్మి తెలిపారు. విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేసి అరెస్ట్ చేసినట్లుగా తెలిపారు. 90 గ్రామాల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లుగా తెలిపారు.

112 లీటర్ల పురుగు మందులు సీజ్

(మొదటి పేజీ తరువాయి)

ఎరువులు పురుగు మందులకు సంబంధించి ప్రిన్సిపల్ సర్టిఫికెట్స్ లేకపోవడంతో రూ.4.43 లక్షల విలువైన 112 లీటర్ల పురుగు మందులను సీజ్ చేశారు. విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ వ్యవసాయ అధికారి కె.రమణ కుమార్ అనుమతులు లేని ఎరువులు పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ ఎన్.రామ చంద్రయ్య, వ్యవసాయ శాఖ ఏడిఎ పి.మస్తానమ్మ, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలన్నీ రాశాక మృత్యువాత

పల్నాడు జిల్లాలో పదో తరగతి విద్యార్థిని మృతి

ప్రజాశక్తి - క్రోసూరు



చిన్నారి మృతదేహం.. ఇన్‌సెట్‌లో మృతురాలు చిన్నారి (ఫైల్)

అనారోగ్యాన్ని సైతం తట్టుకుని ఎలాగోలా పదో తరగతి పరీక్షలు పూర్తి చేసిన విద్యార్థిని ఆఖరి పరీక్ష రాసిన కొద్ది నిముషాల్లోనే మృత్యువాత పడింది. పల్నాడు జిల్లా క్రోసూరు మండలంలో బుధవారం జరిగిన ఘటనపై వివరాల ప్రకారం.. క్రోసూరు మండలం నాగవరానికి చెందిన చిలక కరుణమ్మ, సుబ్బయ్య దంపతులకు ఏకైక బిడ్డ అయిన చిన్నారి (15) స్థానిక జెడ్‌పి పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. పరీక్ష కేంద్రాన్ని సత్తెనపల్లి మండలం భృగబండలో కేటాయించారు. పాఠశాల నుండి ప్రత్యేకంగా బస్సు ఏర్పాటు చేయగా ప్రతిరోజూ అదే బస్సులో చిన్నారి పరీక్షలకు వెళ్లి వస్తున్నారు. రెండ్రోజులుగా చిన్నారికి జ్వరం వస్తున్నా పరీక్షకు వెళు తున్నారు. ఈ క్రమంలో మంగళవారం పరీక్ష రాసిన అనంతరం నీరసంగా ఉండడంతో గమనించిన ఉపాధ్యాయులు బుధవారం పరీక్షకు విద్యార్థినితోపాటు రావాలని చిన్నారి తల్లి కరుణమ్మతో చెప్పారు. దీంతో ఆమెకూడా బుధవారం చిన్నారితో కలిసి పరీక్ష కేంద్రానికి వచ్చారు. పరీక్ష అనంతరం బయటకు వచ్చిన చిన్నారి ఆయాసంగా ఉందని తల్లికి చెప్పడంతో ఆమె బంధువులను పిలిపించి బైక్‌పై రెడ్డిగూడెంలోని ఒ ఆర్ఎంపి వైద్యుని వద్దకు తీసుకెళ్లారు. అయితే పరిస్థితి కొంచెం తీవ్రంగా ఉందని, సత్తెనపల్లికి తీసుకెళ్లాలని ఆయన సూచించడంతో బైక్ మీదే సత్తెనపల్లికి బయలుదేరారు. అయితే మార్గంమధ్యలోనే చిన్నారి మృతి చెందడంతో మృతదేహాన్ని నేరుగా నాగవరంలోని తమ ఇంటికి తీసుకెళ్లారు. ఉన్న ఏకైక కుమార్తె మృతి చెందడంతో ఆ కుటుంబం తీరని శోకంలో మునిగిపోయింది. మృతురాలి గుండెకు చిన్న రంధ్రం ఉందని, పెద్దయ్యాక ఆపరేషన్ చేయించాలని చిన్నప్పుడు వైద్యులు చెప్పారని, డబ్బుల్లేక ఇప్పటి వరకూ చేయించలేదని, పరీక్షల తర్వాత చేయిద్దామని అనుకుంటే ఇప్పుడిలా అయ్యిందని తండ్రి కన్నీరు మున్నీరుగా విలపించారు.



కారంపూడి, పేటసన్నిగండ్లలో పోలీసు కవాతు

ప్రజాశక్తి - కారంపూడి

రానున్న సాధారణ ఎన్నికల దృష్ట్యా ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా, వారిలో విశ్వాసాన్ని పెంపొందించే చర్యలో భాగంగా పల్నాడు జిల్లా ఎస్పీ రవి శంకర్ రెడ్డి ఆదేశాల మేరకు కారంపూడి పోలీస్ స్టేషన్ పరిధిలోని పేటసన్నిగండ్ల గ్రామం మరియు కారంపూడి పట్టణంలోని పలు ప్రాంతాల్లో పల్నాడు అడిషనల్ ఎస్పీ(క్రైమ్) లక్ష్మీపతి ఆధ్వర్యంలో కేంద్ర పోలీసు బలగాలు, సివిల్ పోలీసులతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తూ ప్రజలకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారు. ప్రజల్లో ధైర్యాన్ని నింపే విధంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో పారదర్శక,నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు ప్రజలకు మేమున్నామనే భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు పాటిస్తూ ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా, నిర్భయముగా ఓటు వేసే ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటుందని, ఎన్నికలను సజావుగా, సాఫీగా నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని వారు తెలిపారు.



పోలీసుల యూనిఫాంలో మార్పులు

ప్రజాశక్తి–గుంటూరుజిల్లా ప్రతినిధి

పోలీసు విభాగం లో ఆర్మ్డ్ రిజర్వ్, ఎపిఎస్‌పి పోలీసులకు సంబంధించిన యూనిఫాం నందు బ్యారెట్ క్యాప్, రెడ్ బెల్ట్, ఆకుపచ్చ కలర్ విజిల్ కార్డ్, సంబంధించి మార్పులు జరిగాయని జిల్లా ఎస్పి తుషార్ డూడి తెలిపారు. రాష్ట్ర పోలీసు శాఖ వారు జారీ చేసిన నూతన యూనిఫామ్ సంబంధించి బ్లూ క్యాప్, బ్లాక్ బెల్ట్, బ్లాక్ విజిల్ కార్డును బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పి సిబ్బందికి అందచేశారు. జిల్లా ఎస్పి మాట్లాడుతూ విధుల నిర్వహించేటప్పుడు సిబ్బంది తప్పనిసరిగా బ్లూ క్యాప్ ,బ్లాక్ బెల్టు, బ్లాక్ విజిల్ కార్డు ధరించి విధులు నిర్వహించాలని మిగిలిన సిబ్బంది కూడా ఈ మార్పులు చేసిన యూనిఫామ్ సంబంధించిన బ్లూ పీ క్యాప్, బ్లాక్ బెల్టు, బ్లాక్ విజిల్ కార్డు ధరించి విధులు నిర్వహించాలని ఆదేశించారు.

అడుగంటుతున్న జలాశయాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం 137.76 టిఎంసీలు మాత్రమే నిల్వ ఉన్నాయి. మొత్తంగా ప్రధాన జలాశయాల్లో కనీస నీటి నిల్వలు అడుగంటాయి. నాగార్జున సాగర్,శ్రీశైలంలో నీటి నిల్వ డెడ్ స్టోరేజికి చేరుకుంది. పులిచింతలలో నీటి నిల్వలు రోజురోజుకు తగ్గిపోయి అడుగంటే పరిస్థితి నెలకొంది. పులిచింతలలో నీటినిల్వ బాగా తగ్గిపోవడం వల్ల ప్రకాశం బ్యారేజి వద్ద కూడా నీటి నిల్వ గణనీయంగా తగ్గిపోయింది. ప్రకాశం బ్యారేజి గరిష్టనీటి నిల్వ 3.08 టిఎంసీలుగా కాగా ప్రస్తుతం 2.24 టిఎంసీలే నిల్వ ఉండటం వల్ల గుంటూరు, ఎన్‌టిఆర్, కృష్ణా, బాపట్ల జిల్లాలకు కనీసం చెరువులు నింపుకోవడానికి కూడా ఇబ్బంది రానుంది. నాగార్జున సాగర్‌లో నీటి నిల్వ తగ్గడం వల్ల పల్నాడు, ప్రకాశం జిల్లాలకు కూడా నీటి ఎద్దడి పెరిగింది. కాల్వలు, చెరువులు, జలాశయాల్లో నీరు తగ్గిపోవడం వల్ల భూగర్భజలాల నిల్వలు తగ్గిపోవడంతో నీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చనుంది.

ప్రస్తుతం సాగర్ నుంచి నీరు విడుదల చేసేపరిస్థితి లేదని అధికారులు తెలిపారు. నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో ప్రకాశం, పల్నాడు జిల్లాలో దాదాపు 200 గ్రామాల్లో నీటి సమస్య రావచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రతిఏటా మేనెలలో నీటిఎద్దడి వస్తుందని, కానీ ఈ ఏడాది మార్చిచివరికే ఈ సమస్య రావచ్చని అంటున్నారు. ఈఏడాది జులై నుంచి ఇప్పటి వరకు ఎగువ నుంచి వరద ప్రవాహం రాకపోవడం వల్ల ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గుతూ వస్తున్నాయి. పులిచింతలలోనీటి నిల్వ తగ్గి బురదతో కూడిన కలుషిత నీరు ప్రకాశం బ్యారేజికి చేరడం వల్ల గుంటూరు కార్పొరేషన్‌తో పాటు పలు గ్రామాలకు, పట్టణాలకు ఫిల్టరేషన్ సమస్యలు ఏర్పడుతున్నాయి. పలుచోట్ల డయేరియా సమస్యలు ఉత్పన్నం అవుతు న్నాయి. నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో పల్నాడు జిల్లాతోపాటు గుంటూరు జిల్లాలో తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లోని దాదాపు 200 గ్రామాల్లో నీటి సమస్య ఉత్పన్నం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

మరింతగా కేంద్ర బలగాలను కోరాం

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ పార్టీల కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. నెంబరు ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాలపై చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే కొంతమంది వాహనదారులకు పెనాల్టీలు విధించామని చెప్పారు. గురువారం ఉదయం ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్చి 31వ తేదికి 18 ఏళ్లు నిండే వారు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓట్లు తొలగింపు కొరకు తీసుకునే ఫారమ్–7 ఇకపై స్వీకరించబోమని తెలిపారు. ఎన్నికలను ప్రశాతంగా నిర్వహించేందుకు ఇప్పటికే 635 మందిని బైండోవర్ చేశామని, అవసరమైతే మరి కొందర్నీ చేస్తామని తెలిపారు. ఎన్నికలకు ఆటంకం కల్పించే వారిని ఎన్నికల రోజు ముందుగా ఓటు వేయించి వారిని అదుపులోకి తీసుకునే ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. బిఎస్‌పి అభ్యర్థి తనకు పోలీసు బందోబస్తు కావాలని కోరినట్లు తెలిపారు. సమావేశంలో తహశీల్దార్ డి.మంజునాథరెడ్డి, మున్సిపల్ కమిషనర్ డి.వెంకటదాసు, డిటి జానిబాషా పాల్గొన్నారు.

అప్పుడు పొగిడి.. ఇప్పుడు విస్మరించి..

(మొదటి పేజీ తరువాయి)

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. శివకుమారి మాట్లాడుతూ ఆశా కార్యకర్తలను రెగ్యులరైజేషన్ చేసి ప్రభుత్వ ఉద్యోగాలుగా గుర్తిస్తామన్న ప్రభుత్వం ఆ పని చేయకపోగా పని భారాన్ని పెంచిందన్నారు. పనికి తగ్గ వేతనం ఇవ్వడం లేదని చెప్పారు. ఆశా వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు సక్రమంగా పని చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మరమ్మతులకు గురైతే ఫోన్లను ఆశాలే రిపేరు చేసుకోవాల్సి వస్తోందని తెలిపారు. ఆశా వర్కర్ల సమాచారం నోటు పుస్తకంలో రిజిస్టర్ చేసేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. జిల్లాలో కొన్నిచోట్ల సబ్ సెంటర్లు, హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు డ్యూటీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారని, ఆశా వర్కర్లను ఫీల్డ్ వర్క్ పరిమితం చేయాలని కోరారు. కొన్ని ప్రాంతాల్లో ఆశా వర్కర్ల చేత వ్యాక్సిన్ బాక్స్‌లు తెప్పిస్తున్నారని, పై అధికారులు చేయాల్సిన ఆన్లైన్ పని కూడా ఆశాలతోనే నిర్బంధంగా చేయిస్తున్నారని, వీటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. పని భారం, ఒత్తి పెరుగడంతో పలువురు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో నాయకులు ఎం.ధనలక్ష్మి, ఎం.భూలక్ష్మి తదితరులు ఉన్నారు.



ఎవరెన్ని కుట్రలు పన్నినా ప్రజల అండ మాకే

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి, ఎంపి అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపిని ఓడించేందుకని టిడిపి – జనసేన– బిజెపిలు ఎన్ని కుట్రలు పన్నినా బడుగు, బలహీన వర్గాల ప్రజలు తమకు అండగా నిలబడేందుకు సిద్ధంగా ఉన్నారని నరసరావుపేట వైసిపి అసెంబ్లీ అభ్యర్థి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎంపి అభ్యర్థి పి.అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. రొంపిచర్ల మండలంలోని సంతగుడిపాడులో ఎమ్మెల్యే శ్రీనివాస రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌లు వైసిపి నాయకులు, కార్య కర్తలు, అనుచరులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్‌లు మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు విభేదాలను, బేధాభిప్రాయాలను పక్కన పెట్టి కలిసికట్టుగా ఎన్నికలలో విజయం కోసం పని చేయాలని అన్నారు. వైసిపిని ఓడించేందుకు ఎన్ని పార్టీలు ఏకమైనా ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. నియోజక వర్గంలో ప్రతి కార్యకర్త గడప గడపకూ వెళ్లి వైసిపి ఐదేళ్ల పాలనలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించాలని చెప్పారు.



ప్రచారంలో శివకుమార్ తనయుడు సత్యనారాయణ

కఠెవరంలో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-తెనాలి

సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని వైసిపి ఎన్నికల ప్రచారాన్ని బుధవారం రూరల్ గ్రామం కఠెవరంలో కొనసాగించింది. వైసిపి అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివ కుమార్ తరపున ఆయన తనయుడు సత్యనారాయణ ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ఓటర్లతో మాట్లాడారు. ప్రచారంలో జడ్పిటిసి పి ఉమాప్రణతి, మాజీ సర్పంచ్ జి శివ నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ప్రసాదం బాలగురవమ్మ పాల్గొన్నారు.

పెమ్మసాని వ్యాఖ్యలు గర్హనీయం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తెలుగుదేశం పార్టీ గుంటూరులోక్‌సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ ముస్లిం మనోభావాలు దెబ్బ తినేలా మాట్లాడటం తగదని కాంగ్రెస్ పార్టీ గుంటూరు నగర అధ్యక్షులు షేక్ ఉస్మాన్ పేర్కొన్నారు. చంద్రశేఖర్ అమెరికాలో ఉంటూ భారతదేశానికి వచ్చి ఎన్నికల బరిలోకి దిగారని, ఇక్కడి ముస్లింల మనోభాలకు భిన్నంగా మాట్లాడటం తగదన్నారు. సద్దాం హుస్సేన్ ను ఒక కుక్కతో పోల్చడం ద్వారా ఆయన వివేకం ఏమైందన్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ముస్లిం సమాజం యొక్క మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడడం దారుణం అన్నారు. ఎలక్షన్ కమిషన్ జోక్యం చేసుకొని ప్రేమ సాని మీద కేసు నమోదు చేయాలని ఉస్మాన్ కోరారు. సద్దాం హుస్సేన్‌ను అమెరికా ప్రభుత్వం నానా ఇబ్బందులు పెట్టినటువంటి పరిస్థితి మాత్రమే పెమ్మసానికి తెలుసున్నారు. తెలుగుదేశం పార్టీ బిజెపితో కలిసినప్పటి నుండి చంద్రబాబు నాయుడు భారతదేశంలో సిఏఏ అమలు చేయాల్సిందే, ముస్లిం మైనార్టీ రిజర్వేషన్లు కూడా రద్దు చేయాలని మాట్లాడటం మత విద్వేషాలను రెచ్చగొట్టడమే అవుతుందన్నారు. షేక్ ఆరీఫ్,సయ్యద్ జానీ గోల్డ్, సుధాకర్, గౌస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షేక్ ఉస్మాన్

ప్రజాతీర్పుతో రాష్ట్ర భవిష్యత్తు : టిడిపి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చే తీర్పు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తుందని టిడిపి జనసేన ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి పట ్టణంలోని 9,10 వార్డుల్లో కన్నా లక్ష్మీనారాయణ బుధ వారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ ప్రజల జీవితాలను తీర్చిదిద్దే బాధ్యత తమ కూటమిదని అన్నారు.



ప్రభుత్వాలు మారినప్పటికీ పేదల ఆకలి తీర్చడానికి పెట్టిన ఆహార క్యాంటీన్లను మూసివేయడం ఇంత వరకు ఏ రాష్ట్రంలోనూ చూడలేదన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలోని 18వ వార్డులో బాబు ష్యూరిటీ–భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ యాగంటి మల్లికార్జునరావు పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందజేశారు. కార్య క్రమంలో పట్టణ అధ్యక్షులు కె.దుర్గారావు, వై.కేశవరెడ్డి, ఎం. చినవెంకటరామిరెడ్డి, ఎన్. గురవారెడ్డి, కె.శివ, వి. మురళి, కె. అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి -కారంపూడి

మాచర్ల నియోజకవర్గం తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి జూలకంట బ్రహ్మారెడ్డి బుధ వారం మండలం లోని చిన్నగార్లపాడు నుండి ఇంటింటి ప్రచారం కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. ఇంటింటికి తిరుగుతూ మేనిఫెస్టో గురించి వివరించారు.

ప్రజాశక్తి - తుళ్లూరు

రానున్న ఎన్నికల్లో తమ విజయంపై కూటమి అభ్యర్థి తెనాలి శ్రావణ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. శ్రావణ్ కుమార్ బుధవారం రాత్రి మండలంలోని అబ్బురాజుపాలెం, బోరుపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.వైసిపి అభివృద్ధి నిరోధక, విధ్వంస చర్యలు,అవినీతిని ప్రచారంలో ఎండ గడుతున్నారు. రాజధానిని విశాఖకు తరలించాలని చూసే వారికి ఓట్లు వేయరని అన్నారు. శ్రావణ్ కుమార్ వెంట



టిడిపి నాయకులు దామినేని శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు ధనేకుల సుబ్బారావు, తెలుగు యువత అధ్యక్షులు మూల్పూరి నరేష్ చౌదరి,అబ్బరాజు పాలెం గ్రామం పార్టీ అధ్యక్షులు బి. సుధీర్,గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు బి.సునీల్,టిడిపి,జనసేన పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

30న కూరగాయల మార్కెట్ వేలం

కమిషనర్ దేవళ్ళ వెంకటదాసు

ప్రజాశక్తి - మాచర్ల

ఈ నెల 30వ తేదిన శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కూరగాయల మార్కెట్, సంద్రి మార్కెట్, మాంసం మార్కెట్ వేలం పాటలు నిర్వహిస్తామని మున్సిపల్ కమీషనర్ దేవళ్ళ వెంకటదాసు తెలిపారు. మంగళవారం నిర్వహించిన సదరు వేలం పాటలు వాయిదా పడిన నేపథ్యంలో శనివారం ఉదయం బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అతిక్రమించి రాజకీయ పార్టీ ప్రచారంలో పాల్గొన్న వాటర్ సరఫరాలో పనిచేసే ఆవుట్ సోర్సింగ్ ఉద్యోగి జి శ్రీనివాసరావును విధుల నుండి తొలగించినట్లు తెలిపారు. ఈ మేరకు రిటర్నింగ్ అధికారికి సమాచారమిచ్చినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ప్రకాష్

'ప్యాకేజీ కోసం మంద కృష్ణ'

ప్రజాశక్తి-తాడేపల్లి

అన్నదమ్ముల్లా ఉన్న మాల మాదిగల మధ్య చిచ్చు పెట్టిన చంద్రబాబునాయుడు చరిత్ర హీనుడుగా మిగిలి పోతారని వైసిపి పట్టణ ఎస్‌సి సెల్ అధ్యక్షులు ముది గొండ ప్రకాష్ విమర్శించారు. తాడేపల్లి పట్టణ వైసిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంద కృష్ణ చంద్రబాబు తొత్తుగా ఉండి మాదిగ జాతిని తాకట్టు పెట్టడం సరికాదన్నారు. ఎస్సీ వర్గీకరణ సమస్య పరిష్కరించకుండా అడ్డుపడింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. ఎస్‌సిల్లో ఎవరైనా పుట్టాలని అనుకుంటారా అని చంద్రబాబు అన్నప్పుడు మంద కృష్ణ ఏం చేశారన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా ప్యాకేజీ కోసం రావడం ప్యాకేజీ కోసం కులాన్ని తాకట్టు పెట్టడం మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో బాలసాని అనిల్, చిలుకోటి శ్రీనివాస మధు, తొట్టెంపూడి వికాస్, సింహాద్రి గోపి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

ప్రజాశక్తి-తెనాలి: ద్విచక్ర వాహనం అపహరణ కు గురైన ఘటనపై 3 టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం ఈ నెల 26న రైల్వే స్టేషన్ రోడ్ లోని విశాల్ మార్ట్ వద్ద ఓ వ్యక్తి నిలిపి ఉంచిన వాహనం అదశ్యమైంది. బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 1,14,185
మిర్చి ఎగుమతి	: 1,10,908
మిర్చి నిల్వ	: 83,570

మిర్చి ధరలు

	రూపాయలలో
334	8,500 - 20,000
నెం.5	10,500 - 17,000
273	9,500 - 21,000
341	9,000 - 19,500
4884	10,000 - 16,000
సూపర్ 10	10,000 - 14,500
	నాన్ ఎసి
తేజ	8,000 - 21,500
బడిగి	9,000 - 20,000
దేవనూరు డీలక్స్	9,000 - 18,500
తాలుకాయలు	5,000 - 12,000

కళలు, నాటకాలపై అవగాహన పెంపొందించాలి



మాట్లాడుతున్న రచయిత, దర్శకుడు బివి రావు

ప్రజాశక్తి-తెనాలి

సమాజంపై నాటకాలు, కళల ప్రభావంపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ జాతీయ నాయకులు, రచయిత, దర్శకుడు బివి రావు అన్నారు. ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణానికి చెందిన అభ్యుదయ కళా సమితి ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్ లోని బొల్లిముంత ఫౌండేషన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సభలో ముఖ్యఅతిథిగా బివి రావు పాల్గొన్నారు. ఏపీ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బొల్లి ముంత కష్ణ అధ్యక్షతన జరిగిన సభలో బివి రావు మాట్లాడుతూ ఇంటర్నేషనల్ థియేటర్ ఇన్స్టిట్యూట్ వారు ప్రపంచ రంగస్థలం దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా జరుపుకునేలా నిర్దేశించారన్నారు. సందేశాత్మకంగా ఉండే నాటకాలు, సమాజంలో వాటి పాత్ర, వినోదాన్ని పంచే కళలపై విస్తత ప్రచారం జరగాలన్నారు. సభలో రచయిత ముట్టడి ప్రకాష్, సాహితీవేత్త రంగిశెట్టి రమేష్, నటులు బెల్లంకొండ వెంకట్, జి వసంత యామిని, కె. మధుకర్, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు ఆరేటి రామారావు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-తెనాలి: కుటుంబ కలహాలు నేపథ్యం లో రైలు కిందపడి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని చినరావూరు ప్రాంతానికి చెందిన గోపికృష్ణ (27) బుధవారం రైలు కింద పడి ఆత్మ హత్యాయత్నం చేశాడు. తీవ్ర గాయాలైన వ్యక్తిని చికిత్స నిమిత్తం జిల్లా వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు రెండో పెళ్లి నేపథ్యంలో కుటుంబంలో కలహాలు మొదలై, ఆత్మ హత్యకు దారి తీసినట్లు తెలిసింది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసిపిలో చేరికలు

ప్రజాశక్తి -కారంపూడి: మండలంలోని ఒప్పిచర్ల నుంచి 15 కుటుంబాలు వారు టిడిపి, జనసేనను వీడి వైసిపిలో చేరారు. వైసిపి రాష్ట్ర యువజన విభాగ ఉపా ధ్యక్షులు పి.వెంకట్రామిరెడ్డి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.



విలేకర్లతో మాట్లాడుతున్న అలెగ్జాండర్

టికెట్ ఎవరికి ఇచ్చినా కలిసి పనిచేయాలి

పల్నాడు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అలెగ్జాండర్

ప్రజాశక్తి - వినుకొండ

నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా (టికెట్) పార్టీ అధిష్టానం ఎవరిని నిర్ణయించిన అందరూ కలిసి పనిచేయాలని పల్నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అలెగ్జాండర్ కోరారు. స్థానిక వివిఎస్ లాడ్జీలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు కంచర్ల పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో 50 కుటుంబాలు వివిధ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి అలెగ్జాండర్ ఆహ్వానించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి అన్యాయ, అక్రమ పాలన సాగించి ప్రజాస్వామ్యానికి, తూట్లు పొడిచారని విమర్శించారు. దేశంలో మల్లికార్జున కార్గే, రాహుల్ గాంధీ, రాష్ట్రంలో వైఎస్ షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ శ్రేణులు ఐక్యమవ్వాలని, బిజెపికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తెచ్చి కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని కోరారు. దేశానికి రాహుల్ గాంధీని ప్రధానిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వినకొండ నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్ అధిష్టానం ఎవరికి నిర్ణయిస్తే వారిని గెలిపించేందుకు భేదాభిప్రాయాలు లేకుండా ఐక్యంగా కలిసి పని చేయాలని కోరారు. కార్యక్రమంలో కంచర్ల పూర్ణచంద్రరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బోయపాటి రామాంజనేయులు పాల్గొన్నారు.



డప్పులతో కళాకారులు

డప్పు కళాకారులకు తప్పెట్ల పంపిణీ

ప్రజాశక్తి - అచ్చంపేట

మండల పరిధి చెరుకుంపాలెంలోని ఎస్సీ కాలనీకి చెందిన 10 మంది డప్పు కళాకారులకు స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.20 వేలతో సమకూర్చిన తప్పెట్లను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి సంఘం అధ్యక్షులు తుమ్మ శౌరెడ్డి, మన్నెం భద్రయ్య, ఆర్.సాంబశివరావు, కె.దశరథ రామయ్య, ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ తాయి కరిముల్లా బాబు పాల్గొన్నారు.

సత్తెపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా కంబాల అనీల్ ఏకగ్రీవం

ప్రజాశక్తి-సత్తెనపల్లి



సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ప్రముఖ న్యాయవాది కంబాల అనిల్ ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. అసోసియేషన్ ఎన్నికలు గురువారం జరగాల్సి ఉండగా అధ్యక్ష పదవికి న్యాయవాది గంగూరి అజయ్‌కుమార్, కంబాల అనిల్‌కుమార్ నామినేషన్లు దాఖలు చేశారు. అయితే గంగూరి అజయ్‌కుమార్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో అనిల్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనకు పలువురు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

ఇప్పటి వరకు 28 మందికి షోకాజులు

పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు : పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్



డిఆర్ఒతో కలిసి వివరాలు వెల్లడిస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తరువాత ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అన్నీ సవ్యంగా జరుగుతున్నట్లు జిల్లా ప్రధాన ఎన్నికల అధికారి, పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ తెలిపారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట కలెక్టరేట్‌లో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజలకు ఎలాంటి అవాంతరాలూ ఎదురు కాకుండా పని చేస్తున్నామని, ప్రధానంగా ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు, అధికారులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. ఎన్ కోర్, ఎంసిసి, సి.విజిల్, సువిధ యాప్, బోర్డర్ చెక్‌పోస్టు, ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు, అంతర్ జిల్లా చెక్‌పోస్టు, ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఎన్నికల కోడ్ ప్రకారం నియమించామన్నారు. ఏమైనా ఫిర్యాదులుంటే ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్స్ లేదా జిల్లా కలక్టర్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మార్చి 16 ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ స్థలాలు, ప్రవేటు స్థలాల్లో తొలగించాల్సిన రాజకీయ పార్టీల బొమ్మలు, పేర్లను తొలగించామన్నారు. మీడియా సర్టిఫికేషన్ మోనిటరింగ్ కమిటీ, మండల ప్రజా పరిషత్ అధికారులు, ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్స్ తగిన జాగ్రత్తలు తీసుకొని పని చేస్తున్నట్లు చెప్పారు. 3713 పోస్టర్లు 3 310 బ్యానర్లు, ఇతర పార్టీలకు సంబంధించి 5071 గోడరాతలు, బ్యానర్లు మొత్తం 12094 తొలగింపజేశామని తెలిపారు. రాజకీయ పార్టీల సమావేశాలు, సభల్లో ప్రభుత్వ అధికారులు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది పాల్గొనరాదని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే పల్నాడు జిల్లాలో 9 మంది వాలంటీర్లు, ఐదుగురు అవుట్ సోర్సింగ్ సిబ్బంది, ఇద్దరు కాంట్రాక్ట్ సిబ్బంది, 12 మంది ప్రభుత్వ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని వివరించారు. వారికి మెమో కానీ ఇంక్రిమెంట్ కానీ ఇవ్వడం, మొత్తం మీద 28 మంది మీద చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. సి విజిల్ యాప్‌లో లైవ్‌లో సమస్యను అప్‌లోడ్ చేస్తే దాని మీద 100 నిమిషాల్లో చర్యలు తీసుకుంటున్నామని, 398 కేసులను ప్రజలు సి.విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. ఫిర్యాలను పరిష్కారం 94 శాతంగా ఉందన్నారు. సువిధ, ఎన్ కోర్ లో ఫిర్యాదులు, పర్మిషన్లు 213 దరఖాస్తు వచ్చాయని, ఇందులో లౌడ్ స్పీకర్లు, సభలు, సమావేశాలు ఇస్తామని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు అనుమతుల కోసం పై యాప్‌లో లేదా నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎన్నికల నేపథ్యంలో నామినేషన్స్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చివరిగా ఎవరి నామినేషన్లు తీసుకోవాలి, ఎవరివి తీసుకోకూడదు వీటిపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తామన్నారు. ఎన్నికల సామగ్రి మొత్తం అందుబాటులో ఉందని, జెఎన్‌టియులో లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. నియోజకవర్గాల వారీగా స్టాంగ్‌రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలు పారదర్శంగా నిర్వహించడానికి అన్ని చర్యలూ తీసుకుంటునట్లు చెప్పారు. ఓటు హక్కు కోసం మార్చి 31లోపు దరఖాస్తు చేసుకున్న వారికీ అవకాశం కల్పిస్తామని, వారికి వచ్చే నెల 8 నుంచి 10 లోపు ఫామ్ 6 ద్వారా ఓటర్లుగా నమోదు చేస్తామని, ఫామ్ 8 ద్వారా ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి మార్చుకోవడం ఎన్నికలకు 10 రోజులు ముందు కూడా అవకాశం ఉంటుందని వివరించారు.

బీసీ హాస్టళ్లకు సెప్టెంబర్ నుండి నిలిచిన బిల్లులు

ప్రజాశక్తి - రెంటచింతల



వెనబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న హాస్టళ్లకు సెప్టెంబర్ నుంచి డైట్ బిల్లులు చెల్లించడం లేదు. దీంతో హాస్టల్ వార్డెన్లు అప్పులు చేసి సరుకులు కొనలేక ఇబ్బందులు పడుతున్నారు. పల్నాడు జిల్లాలో 14 కాలేజీ హాస్టళ్లు, 23 ప్రీ మెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి. మాచర్ల నియోజకవర్గంలో 6 బీసీ బాలుర, బాలికల హాస్టల్లో ఉండగా రెంటచింతలలో రెండున్నాయి. వీటిల్లో విద్యార్థులు 470 మంది దాకా ఉన్నారు. ఐదు నెలలకు సంబంధించి బిల్లులు రూ.20 లక్షలు దాకా రావాల్సి ఉంది. కాస్మోటిక్ ఛార్జీలు రాకపోవడంతో ఇంటి నుంచి సభ్యులు నూనె తెచ్చుకోవాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. 3, 4 తరగతులకు విద్యార్థులకు ప్రతినెలా ఒక్కొక్కరికి రూ.175, 5వ తరగతి నుంచి పదవ తరగతి వరకు రూ.200 చొప్పున ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. వీటితోపాటు బిల్లులు చెల్లించాలపి వార్డెన్లు, విద్యార్థులు కోరుతున్నారు.



మృతుల కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి

మరణించిన పోలీస్ కుటుంబాలకు సాయం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఇటీవల మరణించిన పోలీసు కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని తన ఎస్పీ కార్యాలయంలో బుధవారం అందించారు. కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా విధులు ముగించుకుని ఈనెల 7న ఇంటికి వెళుతున్న క్రమంలో రోడ్డు ప్రమాదంలో యడ్లపాడు పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ అశోక్ మృతి చెందారు. బాధిత కుటుంబానికి తోటి కానిస్టేబుళ్ల రూ.8 లక్షలు, పోలీస్ అసోసియేషన్ నుండి చేయూత పథకం కింద రూ.లక్ష చెక్కులను మృతుని బార్య లక్ష్మికి ఎస్పీ అందజేశారు. ఈ నెల 3న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎఆర్ కానిస్టేబుల్ ఎస్.గోపిరెడ్డి భార్య పూర్ణిమకు పోలీస్ అసోసియేషన్ తరపున నుండి చేయూత పథకం కింద రూ.లక్ష చెక్కు, ఎఆర్ విభాగం అందించిన రూ.93 వేలను అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాఘవేంద్ర, ఎఆర్ అదనపు ఎస్పీ రామచంద్రరాజు, డీఎస్పీ ఎఆర్ గాంధీరెడ్డి, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టి.మాణిక్యాలరావు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ప్రతికూల వార్తలపై స్పందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దినపత్రికల్లో వస్తున్న ప్రతికూల వార్తలపై తక్షణమే స్పందించి తగిన విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. ఎన్నికల నోడల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మండల అధికారులు, రిటర్నింగ్ అధికారులతో జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్ నుండి కలెక్టర్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సి విజిల్ యాప్‌లో వస్తున్న ఫిర్యాదులను పరిష్కరించాలని, సమస్యలు ఏమైనా ఉన్నాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సి విజిల్ యాప్ వినియోగంలో జిల్లాలో మంచి పనితీరు కనబరిచిందని అభినందించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్న ప్రదేశాల్లో అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు జిపిఎస్ అనుసంధానం చేశామని, చెక్‌పోస్ట్‌ల వద్ద సీసీ కెమెరాలు అనుసంధానం చేశామని చెప్పారు. రిటర్నింగ్ అధికారులు రోజువారీ నివేదికలు పంపాలన్నారు. హోమ్ ఓటింగ్‌పై విస్తృత అవగాహన కల్పించి విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. జిల్లాలో 85 ఏళ్లు దాటిన వారు 9844 మంది, పిడబ్ల్యుడి పనులు మార్కింగ్ చేసినవి 20,186 ఉన్నాయన్నారు. రిటర్నింగ్ అధికారులు స్ట్రాంగ్ రూమును క్షుణంగా తనిఖీ చేసి భద్రత ఏర్పాట్లు పర్యవేక్షించాని చెప్పారు. సమీక్షలో జిల్లా రెవిన్యూ అధికారి వినాయకం, ఎఎస్‌పి రాఘవేంద్ర పాల్గొన్నారు.

గర్భిణుల కోసం నేడు రక్తదానం శిబిరం

ప్రజాశక్తి - వినుకొండ : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ప్రసవించే గర్భిణుల కోసం గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి నట్లు అభిల్ కలాం తెరిస్సా సేవా సొసైటీ వ్యవస్థాపకులు చం దోలు నాగవాణి తెలిపారు. వైద్య,ఆరోగ్యశాఖ,పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉదయం నిర్వహించే ఈ శిబిరం పట్టణ సిఐ.ఎస్.సాంబశివరావు అధ్వ ర్యంలో జరుగుతుందని తెలిపారు. గర్భిణులకు కాన్పు సమయంలో రక్తం చాలా అవసరం ఉంటుందని, అందుబాటులో రక్తం లేక మహిళలు చాలా అవస్థలు పడుతున్నారని అందుకే ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు వివరించారు. రక్తదానంతో తల్లీ బిడ్డలను ప్రాణాపాయ స్థితి నుండి కాపాడాలని, రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తందానం చేయాలని, రక్తదాతలకు వైద్యశాఖ సర్టిఫికెట్ కూడా ఇస్తుందని తెలిపారు.

ప్రజాశక్తి
గుంటూరు
5
గురువారం 28 మార్చి 2024

ఆస్థి పన్నుపై వడ్డీ రాయితీని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఆస్థి పన్నుపై వడ్డీ రాయితీ గడువు మరో నాలుగు రోజులే ఉన్నందున ప్రజలు వినియోగించుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1 నుండి పన్నుపై వడ్డీ జమ అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పన్ను బకాయి ఏకమొత్తంగా చెల్లించిన వారికి వడ్డీ రాయితీ ప్రకటించిందని, నగర ప్రజలు ఈ నెలాఖరులోపు తమ ఆస్తి, ఖాళీ స్థల పన్నులు పూర్తిగా చెల్లించి వడ్డీ రాయితిని పొందాలని తెలిపారు. నెలాఖరు వరకు వేచి చూడకుండా ముందుగానే పన్ను చెల్లించాలని, నెలాఖరులో సర్వర్ ఆన్ లైన్ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందన్నారు. బకాయిదార్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని తెలిపారు. సెలవు రోజుల్లోనూ జిఎంసి క్యాష్ కౌంటర్లు ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకూ పనిచేస్తాయన్నారు.

అనుమతి లేకుండా సెలవు తీసుకోవద్దు : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

సార్వత్రిక ఎన్నికల్లో విధులు కేటాయించబడిన ప్రతి అధికారి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అందుబాటులో ఉండాలని, ప్రతి ఒక్కరికీ కేటాయించిన విధుల మేరకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలని మేనేజర్‌ని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) కీర్తిచేకూరి ఆదేశించారు. బుధవారం కమిషనర్ చాంబర్‌లో నోడల్, ఇంజినీరింగ్ అధికారులు, సూపరింటెండెంట్‌తో ఎన్నికల నిర్వహణ, విధుల కేటాయింపుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో విధులు కేటాయిం చబడిన సిబ్బంది ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు పూర్తి స్థాయిలో అందుబాటులోనే ఉండాలని, రిటర్నింగ్ అధికారి అనుమతి లేకుండా సెలవులు తీసుకోవడానికి వీలులేదన్నారు. కేటాయించిన విధుల మేరకు ప్రతి ఒక్కరికీ ప్రొసీడింగ్స్ ఇవ్వాలని మేనేజర్‌ని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్, హెూం ఓటింగ్‌లకు కూడా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తగిన అధికారులను కేటాయించాలన్నారు. ఎన్నికల ప్రక్రియ రికార్డింగ్ చేసే వీడియో గ్రాఫర్లు ఎన్నికల కమిషన్ మార్గ దర్శకాల మేరకు రికార్డింగ్ చేయా లన్నారు. ఏఈలు అందరూ ఈవిఎంల పనితీరు, వివిప్యాట్‌ల కనెక్షన్ పై అవగాహన కల్గి ఉండాలని, అందుకు తగిన శిక్షణను మాస్టర్ ట్రైనర్ల ద్వారా అందిస్తామని తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంలు తమకు కేటాయించిన విధుల్లో భాగంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుని క్షేత్ర స్థాయిలో మరింత పటిష్టంగా అమలు చేయాలన్నారు. సమావేశంలో సెక్టోరల్ అధికారి శ్రీధర్, ఏఆర్‌ఓలు సునీల్, భీమరాజు, ఎస్.ఈ. శ్యాం సుందర్, మేనేజర్ ఎస్.ఎన్. ప్రసాద్, సూపరిండెంట్లు, ఈఈలు పాల్గొన్నారు.

అన్ని స్థానాలకూ ఎఆర్ఎస్ పార్టీ పోటీ

వ్యవస్థాపక అధ్యక్షులు జంజనం కోటేశ్వరరావు

ప్రజాశక్తి మంగళగిరి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరావు

సార్వత్రిక ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే రాజ్యాధికారం దక్కించుకుంటారని ఆంధ్ర రాష్ట్ర సమితి పొలిటికల్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జంజనం కోటేశ్వరావు ధీమా వ్యక్తం చేశారు. మంగళగిరి నగరంలోని ఏఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కోటేశ్వరావు మాట్లాడారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు పాద యాత్ర నిర్వహించడం జరిగిందని, ప్రత్యేకించి పేదలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నామని, వాటి పరిష్కారానికి రాజ్యాధి కారం కావాలన్నారు. ముఖ్యమంత్రి, ఇతర శాఖల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పదవులను మనమే తీసుకుందాం పరిపాలిద్దామని కోటేశ్వరావు పిలుపునిచ్చారు. పేదల గుండె చప్పుడు నుండి ఎఆర్ఎస్ పార్టీ పుట్టిందన్నారు. రాష్ట్రంలో 175 అసెంబ్లీ స్థానాలు, 25 పార్లమెంట్ స్థానాలకు ఎఆర్ఎస్ అభ్యర్థులను ఎన్నికలలో నిలుపుతామని అన్నారు. రాష్ట్ర రాజధానిలో ప్రతి డ్వాక్రా గ్రూప్‌కి 1000 గజాల ప్లాటు గిఫ్ట్‌గా ఇస్తామని, విద్య వైద్యం ఉచితంగా అందిస్తామని, ప్రతి రేషన్ కార్డుదారునికి స్వంత భూమి ఇచ్చి రైతుల్ని చేస్తామని మేనిఫెస్టోలో పెట్టామని జె కోటేశ్వరావు తెలిపారు. మీడియా సమావేశంలోనే ఏఆర్ఎస్ పార్టీ నుండి పోటీ చేసే అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. ఈ సమావేశంలో ఏఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

చట్ట సభలకు కమ్యూనిస్టులను గెలిపించుకోవాలి

ప్రజాశక్తి - మంగళగిరి


ఆటో యూనియన్ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న జెవి రాఘవులు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో చట్ట సభలకు కమ్యూనిస్టులను గెలిపించుకోవాలని సిఐటియు సీనియర్ నాయకులు జెవి రాఘవులు అన్నారు. బుధవారం మంగళగిరి సిఐటియు కార్యాలయంలో ఆటో యూనియన్ల నాయకులతో సమావేశం టి శ్రీరాములు అధ్యక్షతన నిర్వహించారు. రాఘవులు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ అసెంబ్లీ, పార్లమెంట్‌లో కమ్యూనిస్టుల సంఖ్య తగ్గిపోవడం వలన కార్మిక వర్గానికి, రైతాంగానికి నష్టం వాటిల్లుతుందన్నారు. ప్రజా పోరాటాలు జరుపుతూనే అసెంబ్లీ పార్లమెంటులో మాట్లాడే కమ్యూనిస్టులను రానున్న ఎన్నికల్లో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. రవాణా రంగ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన జీవో వలన రవాణా రంగ కార్మికులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని విమర్శించారు. సమాజంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలు సమస్యల పరిష్కారానికి పనిచేసే సిఐటియు ప్రస్తావన గురించి వివరించారు. కార్మిక రంగంలో పనిచేస్తున్న వారందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గతంలో పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మరల అధికారంలోకి వస్తే ఎన్నో పోరాటాలతో సాధించుకున్న కార్మిక హక్కులను నిర్వీర్యం చేస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో కార్మిక వర్గ, రైతాంగ వర్గ ప్రతినిధులను చట్ట సభలకు పంపించాలని అందుకు ఆటో కార్మికుల అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు నాయకులు వై కమలాకర్, ఆటో యూనియన్ నాయకులు ఎం వి సుబ్బారావు, వెంకటరమణ, బి కోటేశ్వరరావు, ప్రసాద్, సుదర్శన్‌రావు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలతో 'మా ఎపి'కి పొత్తులు లేవు

వ్యవస్థాపక అధ్యక్షులు, సినీ దర్శకులు దిలీప్ రాజా

ప్రజాశక్తి-తెనాలిరూరల్



ఎన్నికల ప్రచారానికి మా ఎపి దూరంగా ఉంటుందని, రాజకీయా లకు మా-ఎపి కి ఎటువంటి సంబ ంధం లేదని మా-ఎపి వ్యవస్థాపక అధ్యక్షులు, సిని దర్శకుడు దిలీప్ రాజా అన్నారు. తెనాలి మండలం పెదరా వూరు స్టూడియోలో బుధవారం ఏర్పాటు చేసిన మా ఎపి కార్య నిర్వాహక సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని రాజకీయ పార్టీలు తమ పార్టీల మద్దతుకు ప్రచారం చేయమని కోరుతున్నాయని మా ఎపి అందుకు సున్నితంగా తిరస్కరించిందని ఆయన పేర్కొన్నారు. యూనియన్ పరిధిలో 500 మంది సభ్యులు ఆయా కుటుంబ సభ్యుల ఓట్లను తమకు నచ్చిన పార్టీకి వేసుకునే స్వేచ్ఛ ఉందని దిలీప్ రాజా పేర్కొన్నారు. మా ఎపి ఏ రాజకీయ పార్టీకి మద్దతు తెలపబోదన్నారు. దయచేసి రాజకీయాలకు మా ఎపికి ముడిపెట్టొద్దని, ఎన్నికల బరిలో ఉన్న నేతలను కోరారు. 2024 ఎన్నికల్లో గెలుపొందిన పార్టీలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఆంధ్రాలో సిని పరిశ్రమను అభివృద్ధి చేయడమే మాఎపి ఏకైక లక్ష్యమ న్నారు. సమావేశంలో నటుడు వెంకి రావణ్, మిలటరీ ప్రసాద్, అమీర్ చౌదరి, సుందరరామయ్య, కెమెరామెన్ హరి, ఎడిటర్ పెరవలి, మేకప్ మెన్ రవి పాల్గొన్నారు.

అర్చకులపై దాడులకు ఖండన

ప్రజాశక్తి-తెనాలిరూరల్


సమావేశంలో మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘాల నాయకులు

రాష్ట్ర వ్యాప్తంగా అర్చకులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ రాష్ట బ్రాహ్మణ సంఘటన ఉపాధ్యక్షులు తాడేపల్లి సూర్యనారాయణ విలేఖర్ల సమావేశం నిర్వహించారు. బుధవారం స్థానిక టిడిపి నియోజకవర్గ కార్యా లయంలో పార్టీ బ్రాహ్మణ విభాగం నేతలతో ఆయన సమా వేశమయ్యారు. కార్యక్రమంలో సూర్య నారాయణ మాటాడుతూ ఇటీవల కాకినాడలో అర్చకునిపై వైసిపి నేతలు చేసిన దాడి అమానుషమన్నారు. బ్రహ్మణలను ఆకార ణంగా దూషిస్తూ ఆయా సందర్భాన్నిబట్టి ఒక్క క్షమా పణ తో సరిపెట్టడం సరికాదన్నారు. గతంలో భీమవరం, కర్నూ లు, కోటప్ప కొండ ఆలయాల్లో కూడా ఇదే తరహాలో దాడు లు జరిగినా పాలకవర్గాలు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిం చారన్నారు. జరిగిన ఘటనలన్నింటికీ కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికా రులు చొరవచూపి ఇలాంటి ఘటనలు పునరావృతం కా కుండా చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే బ్రహ్మ ణలు పక్షంగా తగిన మూల్యం చెల్లించక తప్పదని తెనాలి వేదిక బ్రాహ్మణ సేవా సమాఖ్య అలాగే రాష్ట్ర బ్రాహ్మణ సంఘటన తరుపున హెచ్చరించారు. టిడిపి సీనియర్ నాయకులు డాక్టర్ జూటూరి సత్యం మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉల్లంగిస్తున్న వైసీపీ అరాచక శక్తులపై పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో విద్యాసాగర్, చంద్ర మోహన్, అచ్చాయమ్మ, దిలీప్, సుధామాధవి, దంటు కామేశ్వరి, ప్రసాదరావు, సుబ్రహ్మణ్యం, పార్టీ నేతలు పాల్గొన్నారు.


కౌలు రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న రైతు సంఘం నాయకులు

రూ.7లక్షల పరిహారం తక్షణం ఇవ్వాలి

మృతి చెందిన కౌలు రైతు కుటుంబానికి రైతు సంఘం పరామర్శ

ప్రజాశక్తి పెదనందిపాడు రూరల్ : మండలంలోని కొప్పర్రు ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న కౌలు రైతు వలపర్ల వెంకటేశ్వర్లు (39 24వ తేదీన పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం మృతి చెందిన కౌలు రైతు కుటుంబాన్ని సిపిఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు,జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, కౌలు రైతు సంఘం నాయకులు చుక్కా యానాదులు, రైతు సంఘం మండల ఉపాధ్యక్షులు పోపూరి సుధీర్, నల్లమోతు రాజేంద్ర, శాఖమూరి రంగనాయకులు పరామర్శించారు. మృతుని భార్య వలపర్ల భారతిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.గత ఏడాది నాలుగు ఎకరాలలో మిర్చి సాగు చేశారని, ఎర్ర నల్లి, తామర తెగులుతో పూర్తిగా నష్టపోయి రెండు లక్షల వరకు నష్టం వచ్చిందని, ఈ సంవత్సరం 4 ఎకరాలలో మిర్చి సాగు చేయగా వర్షం లేక ఎండిపోవడంతోటి వాటిని పీకి వేసి, సెనగ పంట సాగు చేశామని మిచౌంగ్ తుపాను ప్రభావంతో శనగ పంట కూడా పూర్తిగా దెబ్బతిని మూడు లక్షల వరకు అప్పు మిగిలిందని కుటుంబ సభ్యులు నాయకులకు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. మరణించిన కౌలు రైతు కుటుంబానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.7లక్షల పరిహారం వెంటనే అందిచాలని డిమాండ్ చేశారు. రేకుల ఇంట్లో నివాసం ఉంటున్న వారికి ప్రభుత్వం ఇల్లు నిర్మించి ఇవ్వాలని, వారి పిల్లలు ముగ్గురు పిల్లలు మహేష్, శ్రావణి, నరసింహ చదువుల బాధ్యత, మృతుని తల్లి ఏ ఆధారం లేని 60 సంవత్సరాల వృద్ధురాలు వలపర్ల అంకమ్మ బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని, పత్తిపాడు ముత్తూట్ ఫైనాన్స్, స్పందన ఫైనాన్స్‌లో వ్యవసాయం నిమిత్తం తీసుకున్న రుణాల్ని మాఫీ చేయాలన్నారు. రైతు కుటుంబానికి ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా రుణం అందించి ఆదుకోవాలని కోరారు. కౌలు రైతులకు బ్యాంకు ద్వారా రుణాలు ఇవ్వడం సక్రమంగా అమలు కా లేదని, అందువల్ల అధిక వడ్డీలకు బయట అప్పులు తీసుకొని, అతివృష్టి, అనావృష్టితో నష్టం వచ్చి అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని నాయకులు తహశీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు.


మంగళగిరిలో ఎన్నికల ప్రచారంలో పెమ్మసాని

రాష్ట్ర, జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా : పెమ్మసాని

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర, జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని టిడిపి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మంగళగిరి పట్టణంలోని షరాఫ్ బజార్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఎంపీగా గెలిస్తే కేంద్ర ప్రభుత్వం నిధులు అనేకం ఉంటాయని, అదేవిధంగా రాష్ట్ర పభుత్వం నిధులు ఉంటాయని వీటిని తీసుకువచ్చి రాష్ట్ర, జిల్లా అభివృద్ధికి వృషి చేస్తానని అన్నారు. ప్రస్తుత ఎంపీ గల్లా జయదేవ్ రాజకీయాలకు దూరంగా ఉండటానికి ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే తప్పుకున్నారని అన్నారు. ఇప్పుడున్న రాజకీయం వలన ప్రజలకు మేలు చేయ లేకపోతున్నానని అనుకొని తప్పుకున్నారని అన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో అర్చకులపై, ముస్లింలపై దాడులు జరుగుతున్నప్పటికీ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాగా షరాఫ్ బజార్‌లోని షాపులకు వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు, నందం అబద్దయ్య, గాజుల శ్రీనివాసరావు, పి మహేష్, జి ధనుంజయ రావు, షేక్ రియాజ్, జనసేన పార్టీ నాయకులు మునగపాటి వెంకట మారుతీరావు, టీ కొండలరావు, బి. విజయ శేఖర్ పాల్గొన్నారు.

రూ. 1.86 కోట్ల విద్యుత్ బకాయిలు

ప్రజాశక్తి-ఈపూరు

ఈపూరు మండలంలో 24 గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాలు,పోలీస్ స్టేషన్,రక్షిత మంచినీటి పథకాలకు సంబంధించి రూ. 1.86 కోట్లు విద్యుత్ బకాయిలు ఉన్నా యని నరసరావుపేట రూరల్ ఏడిఈ వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. విద్యుత్ బకాయిల వసూళ్ల కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం ఈపురును బుధవారం సందర్శించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు సంబంధించి రూ.76.49 లక్షలు బకాయి ఉందన్నారు. గ్రామపంచాయతీలలో 15 ఆర్థిక సం ఘం నిధులు ఉన్నప్పటికీ సర్పంచులు బకాయిలు చెల్లించడం లేదని చెప్పారు. మండలంలో అత్యధికంగా ముప్పాళ్ళ గ్రామ పంచాయతిలో రూ.38 లక్షల విద్యుత్ బకాయి ఉంద న్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి రూ.1.10 కోట్లు విద్యుత్ బకాయి ఉందన్నారు. బకాయిలు చెల్లించకపోతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడతామని తెలిపారు.



'వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం'

ప్రజాశక్తి - విజయపురిసౌత్

వైసిపి పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.దారు నాయక్ విమర్శించారు. బుధవారం విజయపురిసౌత్ లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైసిపికి ప్రజలు తమ ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. మాచర్లలో ఎమ్మెల్యే పిన్నెల్లిని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. చింతల తండాలో ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయులు,మాచర్ల టిడిపి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాపు జేఏసి అధ్యక్షుడు పి.బ్రహ్మ నాయుడు, జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షుడు ఎస్.కుమార్, మండల టిడిపి అధ్యక్షుడు ఎన్. వీరాస్వామి యాదవ్ పాల్గొన్నారు.

గామాలపాడు, ఇరికేపల్లిలో ఫ్లాగ్ మార్చ్

ప్రజాశక్తి-దాచేపల్లి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురజాల నియోజకవర్గంలోని గామాలపాడు , ఇరికేపల్లి గ్రామాల్లో బుధవారం ఎలక్షన్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. దాచేపల్లి పట్టణ ఎస్ఐ సంధ్యారాణి, సిఐఎస్ఎఫ్, సిఆర్పిఎఫ్, రిజర్వ్ ఆర్మ్ ఫోర్స్ సిబ్బందితో కలిసి ఈ మార్చ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ మార్చ్ నిర్వహించినట్లు చెప్పారు.



హీరో రామ్‌చరణ్ పుట్టినరోజు.. రక్త దానం

ప్రజాశక్తి -కారంపూడి

సినీ నటుడు రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం స్థానిక తోట బజార్ సెంటర్ బ్రహ్మానాయుడు నామాల మండపం (బోడి మేడ) వద్ద మెగా అభిమానులు పుట్టినరోజు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించారు. 50 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో కె. అమర సైదారావు, బిజెపి రాష్ట్ర నాయకులు ఎస్.హనుమంతురావు, జనసేన పార్టీ నాయకులు బి.రామాంజనేయులు, కె.కృష్ణబాబు, కె.వెంకట్రామయ్య, కారంపూడి మండల మెగా యువత పాల్గొన్నారు.

రోగులున్నా... వైద్యులేరి!

- ఏరియా ఆసుపత్రి, పిహెచ్‌సిలో టిబి రోగుల అవస్థ
- టెక్నీషియన్లూ లేరు
- ప్రోత్సాహకాలు అందని ఆశా వర్కర్లు



ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో, మండలంలోని పిహెచ్‌సిలో క్షయ (టిబి) రోగులకు సంబంధించిన పరీక్షలు, చికిత్స చేసేందుకు వైద్యులు, యూనిట్లలో సీనియర్ టిబి లేబరేటరీ సూపంవైజర్ (ఎస్‌టిఎల్ఎస్) లేరు. అధునాతన పరికరాలతో నూత నంగా నిర్మితమైన100 పడకల హాస్పిటల్‌లో క్షయ వ్యాధికి సంబంధించిన డాక్టర్లు, టెక్నీషియన్లు లేకపోవడంపై వ్యాధి గ్రస్తులు విమర్శలు గుప్పిస్తున్నారు. అటు వ్యాధి గ్రస్తులకు, ఆశ వర్కర్లకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని అంటున్నారు.నిబంధన ప్రకారం క్షయ వ్యాధికి సంబంధించి ప్రతి 20 వేల మంది జనాభాకు ఒక హెల్త్ విజిటర్ పోస్ట్ ఉండాలి కానీ, ఆ ఉద్యోగం కూడా ఖాళీగానే ఉంది. ప్రోత్సాహకం పంపిణీలోనూ తీవ్రమైన జాప్యం జరుగుతోంది. క్షయ నిర్ధారణ అయిన రోగులకు కేంద్ర ప్రభుత్వం నెలకు రూ.500 చొప్పున ఆరు నెలల పాటు వ్యాధి సోకిన వ్యక్తికి పౌష్టి కాహారం నిమిత్తం నగదును అందజేస్తుంది. కానీ, నాలుగేళ్లుగా తమ ఖాతాలకు ఆ నగదు జమ కావడం లేదని వ్యాధి గ్రస్తులు వాపోతున్నారు. నిక్షయ పాత్ర ద్వారా ఎంతో ప్రోత్సహించాల్సిన కేంద్ర ప్రభుత్వం అనేక ఆంక్షలతో దాతలను ఇబ్బంది పెట్టింది. దీంతో, స్థానికంగా ఉన్న స్వచ్ఛంద సంస్థలు ఈ క్షయ వైద్యశాలను మూసివేశారు. దీంతో , వేల మంది రోగులకు మందులు, పౌష్టికాహారం లేక ఇబ్బంది పడుతున్నారు. క్షయ వ్యాధి బారిన పడిన వారిని గుర్తించడం, వెంటనే ఆరు నెలల పాటు డైరెక్టులీ అబ్జర్వ్‌డ్ థెరఫి (డాట్) పద్ధతి ద్వారా ఆశ కార్యకర్తల సహాయంతో రోగికి క్రమం తప్పకుండా మందులు ఇవ్వాలని, పలు కారణాలతో వారికి మందులు ఇవ్వడం లేదని ఆశాలు చెబుతున్నారు.

'ఆశా'ల ఆవేదన

పట్టణంలో మొత్తం ఆశా వర్కర్లు 31 మంది, 29 సచివాల యాల్లో 29 మంది ఎఎన్ఎంలు ఉన్నారు. సచివాలయాలు కాకుండా ఆశాలు 31 మందికి జీతాలు ప్రతినెలా సక్రమంగా రావడం లేదని వాపోతున్నారు. నాలుగేళ్ల క్రితం దాకా ఎల్‌సిడి ప్రత్యేక ప్రోగ్రాము కింద గర్భిణులకు వైద్యం నిమిత్తం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌కు తీసుకు వస్తే ఖర్చుల నిమిత్తం ఆశాకు రూ.500, ట్యూబెక్టమి చేయించుకున్న స్త్రీకి రూ.300, తీసుకొచ్చిన ఆశాకు. రూ.150, కుష్టు వ్యాధి, రాగి వర్ణపు మచ్చలు ఉన్న వ్యక్తులను గుర్తిస్తే ప్రత్యే కంగా రూ.210, పల్స్ పోలియో వంటి ప్రోగ్రాముల్లో పాల్గొంటే రోజుకు రూ.70 అదనంగా ఇచ్చేవారని, ప్రస్తుతం ఈ ప్రోత్సాహకాలను నాలుగేళుగా ఇవ్వడం లేదని చెప్పారు. ప్రభుత్వం తమ బకాయిలు ఇవ్వాలని కోరారు.

ఎన్నికల నిర్వహణపై సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్

జిల్లా స్థాయిల్లో శాశ్వత ప్రాతిపదికన ఉన్న రాజకీయ పార్టీల కార్యాలయాల్లో స్థానిక చట్టాలు, అనుమతుల మేరకు ప్రస్తుతం ఉన్న రాజకీయ ప్రకటనల హోర్డింగులను తొలగించకుండా కొనసాగించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుండి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లును, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలు తీరును సమీక్షించారు. ఈ సమీక్షలో నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్ నుండి పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో రాష్ట్ర సచివాలయంలో సమావేశం నిర్వహించిన సందర్భంగా పార్టీల శాశ్వత కార్యాలయాల్లో హోర్డింగులను తొలగించడంతో పాటు పలు సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చినట్లు చెప్పారు.ముందుగా అనుమతి పొందిన అనంతరం ఇంటింటి ప్రచారానికి వెళ్లాలనే నిబంధన అమలు దుస్సాధ్యమని, ఈ నిబంధనను పున: సమీక్షించాలని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరారన్నారు. ఈ అంశంపై త్వరలోనే సరైన నిర్ణయం తీసుకొని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులకు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల మేరకు ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన వాణిజ్య స్థలాలతో పాటు కార్యా లయాల్లో కూడా ఎటువంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, పోస్టరులు, బ్యానర్లను అనుమతించ వద్దన్నారు. ప్రస్తుతం జాతీయ, ప్రధాన రహదారుల పక్కనున్న హోర్డింగులను అన్ని రాజకీయ పార్టీలకు సమాన ప్రాతిపదికన కేటాయించాలని, నూతన హోర్డింగులకు అనుమతులను ఏమాత్రం ఇవ్వొద్దన్నారు. ప్రైవేటు భవనాలపై వాల్ పెయింట్స్ కు ఎటు వంటి అనుమతిలేదని, ఇప్పటికే ఉన్నవాటిని వెంటనే చెరిపించేయాలన్నారు.

రాజకీయ ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష

పల్నాడు జిల్లాలో రాజకీయ పార్టీల సమావేశం జిల్లా కేంద్రం నరసరావుపేట కలెక్టరేట్ లో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. అదనపు జిల్లా ఎస్పీ రాఘ వేంద్రరావు, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో 85 ఏళ్ల దాటిన వారు ఎంతమంది ఉన్నారు? వారి నుండి ఏ విధంగా ఇంటిదగ్గర ఓటు తీసుకుంటారని రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగారు. రైల్వే అధికారులను, మీడియా వారిని, ఆర్టీసీ వారికి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఇవ్వాలని రాజకీయ ప్రతినిధులు కోరారు. సమయం వచ్చినప్పుడు తప్పనిసరిగా, వీరందరికీ ఓటు హక్కును కల్పిస్తామని చెప్పారు. రాజకీయ పార్టీ ప్రతినిధుల వినతులను కలెక్టర్ స్వీకరించారు. వారికి సమాధానం ఇవ్వాలని డిఆర్ఒకు సూచించారు.



సాల్మన్ రాజు చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

విశ్రాంత న్యాయమూర్తి సాల్మన్ రాజుకు నివాళి

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

విశ్రాంతి న్యాయమూర్తి సాల్మన్ రాజుకు సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ సీనియర్ జడ్జిగా విధులు నిర్వహించిన సాల్మన్ రాజు అకాల మృతి న్యాయవ్యవస్థకు , ఆయన కుటుంబానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో అంకితభావంతో పని చేశారని కొనియాడారు. కేసులకు సంబంధించి సత్వర పరిష్కారాలు చేసే వారని చెప్పారు. ఇక్కడ సీనియర్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న నేపథ్యంలో నెల్లూరు జిల్లా జడ్జిగా పదోన్నతిపై వెళ్లారని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు సయ్యద్ అబ్దుల్ రహీం , డి.జ్ఞాన్ రాజ్ పాల్, అసోసియేషన్ ఉపాధ్యక్షులు సిహెచ్ మాణిబాబు పాల్గొన్నారు.

మతసామరస్యానికి మారుపేరు 'రంజాన్'

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్



ఇఫ్తార్ విందులో పాల్గొనడం తనకు ఎంతో గొప్ప అను భూతిని కలిగించిందని సత్తెనపల్లి జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు బొర్రా వెంకట అప్పారావు అన్నారు. ధూళిపాళ్ల జనసేన పార్టీ కార్యాలయంలో ముస్లింలకు బుధవారం ఇఫ్తార్ విందు ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

ఎన్నికలకు సమాయత్తం కావాలి: టిడిపి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

బూత్ స్థాయి కార్యకర్తలు, క్లస్టర్ ఇంఛార్జులు ఎన్నికలకు సన్నద్ధం కావాలని సత్తెనపల్లి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. సత్తెనపల్లి పట్టణంలోని టిడిపి ప్రజావేదికలో క్లస్టర్ ఇంఛార్జులు, బూత్ స్థాయి కార్యకర్తలతో ఆయన బుధ వారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటి ప్రచారం, బాబు సూపర్ సిక్స్ పథ కాలను ప్రతి ఇంటికి వెళ్లి తెలియజేయాలని కోరారు. నియోజకవర్గంలోని అన్ని పట్టణాల్లోని వార్డులలో, గ్రామాల్లో అందరూ నాయకులు, కార్యకర్తలు కలిసి రాబోయే 46 రోజులు ప్రజల వద్దకు వెళ్లాలని చెప్పారు. టిడిపి రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి వై.రామస్వామి, మండల పార్టీ అధ్యక్షులు ఎ.అమ రేశ్వరరావు, బి.నాగేశ్వరరావు టిడిపి నేతలు ఆతుకూరి నాగేశ్వరరావు, ఎ.సాంబయ్య పాల్గొన్నారు.

'అరాచక పాలనకు చరమగీతం పాడదాం'

ప్రజాశక్తి - మాచర్ల

రాష్ట్రంలో ఉన్న అవినీతి, అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు జనసేన, బిజెపి, తెలుగుదేశం పార్టీల నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పోరాడాల్సి ఉందని ఉమ్మడి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. స్థానిక బిజెపి కార్యాలయంలో జరిగిన బిజెపి కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉమ్మడి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడారు. పల్నాడు ప్రాంతంలో సాగునీరు, త్రాగునీరు, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కలిసి పనిచేద్దామన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోని ఐక్యంగా ముందుకు వెళదామన్నారు. బూత్ లెవల్‌లో కార్యకర్తలు ఐక్యంగా పనిచేసేందుకు ప్రణాళికలను రూపొందించుకుందామన్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు సుధాకర్ బాబు, జిల్లా ఇన్‌ఛార్జి శ్రీనివాస్‌యాదవ్, ఒంగోలు జిల్లా ఇన్‌ఛార్జి రవిశంకర్, నియోజకవర్గ కన్వీనర్ గుమ్మడి నాసరయ్య, శెట్టిపల్లి హనుమంతరావు, వెండిదండి శ్రీనివాసరావు, జనసేన నాయకులు రామాంజ నేయులు, ప్రసాదు, పులిహరి పాల్గొన్నారు.

లావణ్య ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-పెదకూరపాడు

పెదకూరపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ భార్య లావణ్య బుధవారం హుస్సేనగరంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నెల్లూరు మల్లికార్జున రావు, పటాన్ నూర్జహాన్, షేక్ ముంతాజ్ పాల్గొన్నారు.

48 గంటల ముందే అనుమతి తీసుకోవాలి

రాజకీయ పార్టీలతో సమావేశంలో కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహాయ సహకారాలు అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు నిర్వహించే కార్యక్రమాలకు ముందస్తు అనుమతి తప్పనిసరని, ఇందుకు 48 గంటల ముందుగా సువిధా పోర్టల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉందన్నారు. కాని కొన్ని అత్యవసర పరిస్థితిల్లో ఆన్లైన్‌ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేని పక్షంలో భౌతికంగా దరఖాస్తులను స్వీకరించి సకాలంలో తగిన అనుమతులను జారీ చేయడం జరుగుతుందన్నారు. ఆ తరువాత వివరాలను ఆన్లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. సి విజిల్‌లో వచ్చిన 78 కంప్లైంట్లను ఆర్‌ఓలు పరిష్కరించడం జరిగిందన్నారు. ప్రభుత్వ , ప్రభుత్వరంగ ప్రాంగణాలలో , తాత్కాలిక పార్టీ కార్యాలయ ఏర్పాటు , వాణిజ్య స్థలాల్లో ఎటువంటి రాజకీయ పార్టీల హోర్డింగ్స్ , జెండాలు, పోస్టర్లకు


మాట్లాడుతున్న కలెక్టర్

ఎటువంటి అనుమతి లేదన్నారు. ప్రైవేటు స్థలాల్లో తాత్కాలిక పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేయడానికి 4x8 సైజు ప్లెక్సి , ఒక జెండా ఏర్పాటు చేసుకోవడానికి స్థల యజమాని నుండి ఇష్టపూర్వకంగా అనుమతి తీసుకున్న అనంతరం రిటర్నింగ్ అధికారి అనుమతి మంజూరు చేయడం జరుగు తుందన్నారు. కరపత్రాలు, ఆడియో, వీడియో సందేశాలకు సంబంధించి ముందస్తుగా ఎంసీఎంసీ కమిటీ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటిస్తూ ప్రచారాలు నిర్వహించు కోవాలన్నారు. సమావేశంలో నగర కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖార్‌జైన్, డిఆర్‌ఓ పెద్దిరోజా, ఆప్ నుండి డాక్టర్ సేవాకుమార్, బిఎస్‌పి నుండి సిహెచ్.వాసు, బిజెపి నుండి పద్మనాభరావు, సిపియం నుండి వై.కృష్ణకాంత్, కాంగ్రెస్ నుండి బి.సునీల్, టిడిపి నుండి కె.శివరామయ్య పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జెసి తదితరులు

పోలింగ్ కేంద్రాల్లో పరిశీలన

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మంగళగిరిలోని సెక్టార్ 15లో 13 పోలింగ్ కేంద్రాలను, సెక్టార్ 16లో రెండు పోలింగ్ కేంద్రాలను బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ రిటైర్నింగ్ అధికారి జి రాజకుమారి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలోని మౌలిక సదుపాయాలు ఎలక్ట్రిక్ కనెక్షన్లు, ఫ్యానులు, లైట్లు పనిచేస్తున్నాయో లేదో అని పర్యవేక్షించారు. తదుపరి పోలింగ్ కేంద్రంలోకి ఫర్నీచర్, మంచినీటి వసతి, టాయిలెట్లలో మంచినీటి సౌకర్యం, గ్రౌండ్ లెవెలింగ్, విద్యుత్ లైన్ల ఏర్పాట్లను గూర్చి సెక్టారు అధికారులకు సూచనలు ఇచ్చారు. మంగళగిరి మండలంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఆచరణ తీరును పర్యవేక్షించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, సెక్టారు అధికారులు, సెక్టారు పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో తాగునీటి కొరత లేకుండా చూడాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో రాబోయే వేసవి కాలంలో మంచినీటి ఎద్దడి రాకుండా చూడాలని నగరపాల సస్థ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఎమినిటీస్ సెక్రటరీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వార్డుల్లో ఉన్న వాస్తవ పరిస్థితి, నీటి సరఫరా వేళలు, చేతి పంపుల పరిస్థితిపై ఆరా తీశారు. చేతి పంపులను పరిశీలించి మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలన్నారు. నీటి కొరత ఏర్పడే ప్రాంతాలను గుర్తించి ట్యాంకర్ల ద్వారా మంచినీరు అందించాలన్నారు. మంచినీటి సరఫరాకు ముందు


మాట్లాడుతున్న కమిషనర్ నిర్మల్‌కుమార్

క్లోరినేషన్ చేయాలని, ఆ సమాచారాన్ని రిజిష్టర్‌లో నమోదు చేయాలని చెప్పారు. రానున్న మూడు నెలలు నీటి కొరత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశ:ఓల డిఇ ఎస్ఎస్ఆర్ కృష్ణారెడ్డి, ఎఇ బి.కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విత్తన గోడౌన్లలో వ్యవసాయాధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-గుంటూరు

వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయ విత్తన తనిఖీ బృందాలు బుధవారం గుంటూరు నగరంలోని పలు విత్తన గోడౌన్లలో తనిఖీ నిర్వహించి, నాణ్యత నిర్ధారణ పరీక్షలు చేశారు. ఏటుకూరు రోడ్డులోని క్రిస్టల్ క్రాప్‌సైన్సెస్ కంపెనీలో బిటి పత్తి 5 రకాల నమూనాలు, గ్లైసెల్ కలుపుమందు నిర్ధారణ పరీక్ష, ఎల్ఎఫ్ఎస్ పరీక్ష నిర్వహించారు. 5 శాంపిళ్లు నాణ్యమైనవిగా నిర్ధారించారు. అనంతరం పట్నం బజారులోని శ్రీనివాస ఏజెన్సీస్, రాజాగారి తోటలోని భవానీ సీడ్స్ సెంటర్ షాపులలో తనిఖీలు నిర్వహించారు. కావేరీ సీడ్స్ కంపెనీ, నూజివీడు సీడ్స్ లిమిటెడ్ గోడౌన్లలో తనిఖీ చేశారు. అనుమతి లేని బిటి గ్లైసెల్ విత్తనాలు అమ్మితే లైసెన్స్‌లు రద్దు చేస్తామని అధికారులు హెచ్చరించారు. బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో ఎడిఎ మద్దులేటి, ఏఓ సురేష్‌రెడ్డి, స్థానిక వ్యవసాయాధికారి బి.అంజిరెడ్డి పాల్గొన్నారు.


తనిఖీలు చేస్తున్న అధికారులు


విజయం సాధించిన విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు, కళాశాల యాజమాన్యం

అభ్యుదయ కాలేజీలో ఐఎల్ఎం జాబ్‌మేళా

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా డిగ్రీ కాలేజిలో బెంగుళూరుకు చెందిన ఇన్స్టిట్యూట్ ఆఫ్ లాంగ్వేజ్ మేనేజ్‌మెంట్ (ఐఎల్ఎం) సంస్థ జాబ్ మేళా నిర్వహించారు. మొత్తం 67 మంది ఇంట ర్వ్యూకు హాజరు కాగా 40 మంది విజయం సాధించా రని సంస్థ హెచ్ఆర్ ప్రతినిధి గౌస్‌పాషా తెలిపారు. ఆయా విద్యార్థులను ఐఎల్ఎం హెచ్ఆర్ ప్రతినిధులు గౌస్‌పాషా, పవన్, కళాశాల యాజమాన్యం బిఎస్ఆర్‌కె.ప్రసాద్, ప్రిన్సిపాల్ రోహిణిదేవి తదితరులు అభినందించారు.

ఇళ్ల వద్దే అమరావతి రైతుల దీక్షలు

ప్రజాశక్తి - తుళ్లూరు

ఎన్ని ఆటంకాలు ఎదురైనా అమరావతిని సాధించుకునే వరకు ఉద్యమం ఆగదని రాజధాని రైతులు,రైతు కూలీలు,మహిళలు స్పష్టం చేశారు.రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలని,మూడు రాజధానులు వద్దని రైతులు చేస్తున్న దీక్షలు బుధవారంతో 1562 వ రోజుకు చేరాయి.ఎన్నికల నియమావళి, పోలీసుల సూచనలతో దీక్షలను ఇళ్ళ వద్ద చేపట్టారు. తుళ్లూరు, అనంతవరం, నెక్కల్లు, వెంకటపాలెం తదితర గ్రామాల్లో దీక్షలు సాగాయి.అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులు వెలిగించి జై అమరావతి అంటూ నినదించారు.



టిజెపిఎస్ కాలేజీలో మెగా జాబ్‌మేళా

వంద మందికి నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టి.జె.పి.యస్. కళాశాల కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం మ్యాజిక్ బస్ కొలాబరేషన్‌తో మెగా జాబ్‌మేళా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి కళాశాల సెక్రటరీ, కరెస్పాండంట్ కె.వి.బ్రహ్మం మాట్లాడుతూ చదువుతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో మెగా జాబ్‌మేళా వంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రిన్సిపాల్ ఏబిపి మనోహర్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే భాషానైపుణ్యాలతో పాటు కంప్యూటర్‌పై అవగాహన ఉంటే త్వరగా ఉద్యోగాలు వస్తాయన్నారు. మ్యాజిక్‌బస్ డైరెక్టర్ చిలకా మోహన్ మాట్లాడుతు డిగ్రీ చదువుతున్నప్పుడే విద్యార్థి నైపుణ్యాలు అలవరచుకోవాలని చెప్పారు. జాబ్ మేళాకు ఏసెన్సర్, ముత్తూట్ ఫైనాన్స్, జె.వై. సాఫ్ట్‌వేర్, బి.యమ్.యస్, యునోస్ సర్వీస్, క్యూస్, టెక్రో, వేరేమెరిన్, 24/7 ఏ.ఐ. వంటి కంపెనీలు విచ్చేశాయి. 225 మంది విద్యార్థులు హాజరు కాగా, 100 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆయా విద్యార్థులకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ సెల్ అధికారి జి.సురేష్ బాబు, డాక్టర్. యస్.అనితా దేవి, బాను మురళి, డాక్టర్. జె.వి.సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

ముస్లిమ్ సమాజానికి పెమ్మసాని బహిరంగ క్షమాపణ చెప్పాలి : మాజీ కౌన్సిలర్

ప్రజాశక్తి పొన్నూరు రూరల్



యావత్ ముస్లిం సమాజం పై విషం కక్కుతూ బహిరంగ సమావేశంలో సద్దాం హుస్సేన్ పై గుంటూరు తెలుగుదేశం పార్టీ పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడిన వ్యాఖ్యలపై ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని 21వ వార్డు మాజీ కౌన్సిలర్, వైసీపీ నాయకుడు షేక్ నయూం భాషా డిమాండ్ చేశారు. స్థానిక 21వ వార్డులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సద్దాం హుస్సేన్ ముస్లిం సమాజానికి మార్గదర్శకుడని జాతి కోసం, జాతి హక్కుల కోసం పోరాడి అసువులు బాసిన మహోన్నత వ్యక్తని కొనియాడారు. విదేశాల్లో ఉండి భారతదేశానికి వలస వ్యక్తిలా వచ్చిన పెమ్మసాని ప్రజాస్వామ్యయుతంగా పోటీ చేసే వ్యక్తి ఇలా మత విద్వేషాలు రెచ్చగొట్టడం సమంజసం కాదని హితవు పలికారు. గతంలో కూడా పెమ్మసాని 'కాల్చి వేయండి' అనే పదాలు వాడి హింసను ప్రేరేపించాడని గుర్తు చేశారు. మతం, జాతి, కుల విద్వేషాలు రెచ్చగొట్టే పెమ్మసాని చంద్రశేఖర్‌ను ప్రజలు క్షమించరని యావత్ ముస్లిం సమాజం రాబోయే ఎన్నికల్లో వ్యతిరేకంగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బహిరంగంగా ముస్లిం సమాజంపై అక్కసు వెళ్ళగక్కిన పెమ్మసాని వ్యాఖ్యలను ప్రభుత్వం సుమోటోగా స్వీకరించి తగిన శిక్ష వేయాలని నయూం భాషా ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.



రాష్ట్రాభివృద్ధి కోసమే పొత్తు

కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - కొల్లిపర

రాష్ట్ర అభివృద్ధి కోసమే పొత్తు పెట్టుకోవాల్సి వచ్చిందని తెనాలి నియోజకవర్గ జనసేన టిడిపి బిజెపి ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం మండలంలోని కుంచవరం, సిరిపురం, దంతులూరు గ్రామాల్లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. తనను గెలిపించినట్లయితే ప్రతి ఇంటికి నీటి కొళాయి, రోడ్లు, ఉద్యోగము ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి కుంటుపడిందని, ఇసుక, మట్టి మాఫియాలు సామ్రాజ్యాన్ని ఏలుతున్నాయన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఎర్ర వెంకటేశ్వర నాయుడు, భీమవరపు వేణుగోపాల్ రెడ్డి భీమవరం కిషోర్ రెడ్డి, తెలుగుదేశం నాయకులు వంగా సాంబిరెడ్డి భీమవరపుచిన్న కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెదకాకాని ఆలయ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి తెనాలి :పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం కానుకల హుండీల లెక్కింపు బుధవారం జరిగింది. ఆలయ ఉపకమిషనరు, కార్యనిర్వాహణాధికారి దాసర శ్రీరామ వరప్రసాదరావు వెల్లడించిన వివరాల ప్రకారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు లెక్కింపు జరిగింది. ఈ ప్రక్రియను పాత గుంటూరు శ్రీ అగస్తేశ్వర స్వామి వారి దేవస్థానము ప్రథమ శ్రేణి కార్యనిర్వహణాధికారి ఎన్ ఎల్ టి సౌమ్య పర్యవేక్షణలో జరిగింది. గడిచిన 96 రోజుల హుండీ ఆదాయము రూ.52,70,371 నగదు, అన్నదానం రూ. 79,370, బంగారము 11 గ్రాములు 500 మిల్లి గ్రాములు, వెండి 705 గ్రాములు 500 మిల్లి గ్రాములు ఆదాయం లభించిందని ఉప కమిషనర్ తెలిపారు.

మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీగా పద్మజ

ప్రజాశక్తి-గుంటూరు

ఏపిఎస్ఇపిసిఆర్ ప్రోగ్రాం ఆఫీసర్ (డిప్యూటీ డైరెక్టర్)గా విధులు నిర్వహిస్తూ, ఆంధ్రప్రదేశ్ మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన ఎన్.పద్మజ బుధవారం స్థానిక మహిళా ప్రాంగణంలోని తన ఛాంబర్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డిని కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న పద్మజ

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయండి

విసికి ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తదితరులు వినతి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గడచిన రెండేళ్లుగా బిఏ, బీకాం, బి బి ఏ విద్యార్థులకు 5వ సెమిస్టర్‌లో ఇంటర్న షిప్ , ఆరో సెమిస్టర్ లో పరీక్షలు నిర్వహిస్తున్నారని వారికి ఐదవ సెమిస్టర్ లోనే తరగతులు, పరీక్షలు నిర్వహించాలని ఎమ్మెల్సీ కె .ఎస్. లక్ష్మణరావు కోరారు. బుధవారం విశ్వవిద్యాలయానికి వచ్చిన ఆయన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి. రాజశేఖర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన విసితో మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి బీఎస్సీ విద్యార్థుల మాదిరిగా బీకాం, బిఏ, విద్యార్థులకు ఐదవ సెమిస్టర్ డిసెంబర్లోనే పరీక్షలు నిర్వహించాలని కోరారు. సిలబస్ పూర్తికాని దృష్ట్యా ఏప్రిల్ 1వ తేదీ నుండి జరగాల్సిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయమని వర్సిటీ విసికి ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఆంధ్రప్రదేశ్ లెక్చరర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ జి. నాగరాజు తదితరులు మెమోరాండం ఇచ్చారు.



విసికి మెమోరాండం ఇస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తదితరులు

సైన్స్ పోటీల్లో సమీవుస్‌కు ద్వితీయ బహుమతి

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థుల్లో దాగి ఉన్న సైంటిఫిక్ టెంపర్‌ను వెలికి తీయటంలో భాగంగా జెవివి నిర్వహించిన సైన్స్ ప్రయోగాల వినూత్న పోటీలు-2024లో పాల్గొన్న తాడేపల్లి మండలం, నులకపేట మండల పరిషత్ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని షేక్.సమీవుస్ పాల్గొని రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా పలువురు జిల్లా అధికారులు విద్యార్థిని సమీవుస్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు షేక్.షాహిద్ అలీని ఉర్దూ డిఐ ఖాసిం, ఎంఇఒలు గరిక శాంతకుమారి, డి.నాగేశ్వరరావు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ షేక్.జిలానీ, హెచ్‌ఎం అబ్దుల్ నజీర్ అభినందించారు.



సమీవున్‌ను, ఉపాధ్యాయడు షేక్ షాహిద్‌ను అభినందిస్తున్న ఉర్దూ ఖాసిం,



క్రీడలను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

హిందూ ఫార్మశీలో స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసి కళాశాలలో అంతర కళాశాలల ఆటల పోటీలు బుధవారం ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులకు విద్యతో పాటు తాము కల్పించిన మౌలిక సదుపాయాల గురించి తెలియచేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి. పార్థసారధి మాట్లాడుతూ విద్యతోపాటు తమకు నచ్చిన ఆటలను ప్రాక్టీసు చేస్తూ ఉత్సాహంగా, ఆరోగ్యంగా జీవితం గడపాలని, తాము నిర్ణయించుకున్న గమ్యాన్ని చేరాలని అన్నారు. డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్ మెంట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రీడలలో రాణించి కుటుంబానికి, కళాశాలకు పేరు తేవాలని అన్నారు. తొలుత అతిథులు క్రీడాజ్యోతి వెలిగించి, పావురాళ్లు,బెలూన్‌లు ఎగురవేసి, టపాకాయలను పేల్చి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు, హానరరి చైర్మన్ డాక్టర్ మన్నవ రాధాకష్ణమూర్తి , పాలకమండలి సభ్యులు మాజేటిప్రసాద్, చింతలపాటి వెంకట్రామయ్య, చెరువు రామ్మూర్తి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, స్పోర్ట్స్ వ్యాఖ్యాత, రాష్ట్రస్థాయి కబడ్డీ రిఫరీ వెలగా అమ్మయ్య పాల్గొన్నారు.

శాశ్వత ప్రాతిపదికన ఉన్న హోర్డింగులు తొలగించొద్దు

ప్రజాశక్తి-గుంటూరు

శాశ్వత ప్రాతిపదికన రాజకీయ పార్టీల కార్యాలయాల్లో స్థానిక చట్టాలు, అనుమతుల మేరకు ప్రస్తుతం ఉన్న రాజకీయ ప్రకటనల హోర్డింగులను తొలగించకుండా కొనసాగించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులకు సూచించారు.బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఎన్నికల నిర్వహణకు ముందస్తు చేస్తున్న ఏర్పాట్లును, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలు తీరును జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ వీసీ సమావేశ మందిరం నుంచి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, మంగళగిరి నియోజకవర్గం ఆర్ఒ జి.రాజకుమారి, గుంటూరు తూర్పు నియోజ కవర్గం ఆర్ఒ కీర్తి చేకూరి, డిఆర్ఒ పెద్ది రోజా తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారితో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, తదితరులు

డెల్టా ప్రాంతానికి నీరు వదలండి : సిపిఎం

ప్రజాశక్తి దుగ్గిరాల

బకింగ్ హామ్ కాలువలు నీరు లేకపోవడం వల భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లలో సైతం నీరు రావటం లేదని వెంటనే బకింగ్‌హామ్ కాలువకు నీరు విడుదల చేయాలని సిపిఎం నాయకులు కోరారు. మండల కేంద్రం దుగ్గిరాలలోని ప్రజా సంఘాల కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు మాట్లాడారు. మొక్కజొన్న, జొన్న ఆఖరు దశకు చేరా యని సకాలంలో నీరు అందకపోతే దిగుబడి తగ్గే ప్రమాదం ఉందన్నారు. చెరువుల్లో నీళ్ల లేక పశువులకు కూడా నీరు అందించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కృష్ణానది ప్రక్కన ఉన్నా, పరివాహక ప్రాంతాల్లో సైతం బోర్లలో నీరు అడుగంటి పోయాయని తాగునీటి చెరువులకు వెంటనే నీరు వదలాలని కోరారు. పేదలు, కార్మికులు, రైతులు, కౌలు రైతులు, కూలీల సమస్యలపై సిపిఎం నిరంతరం ప్రజల పక్షాన ఉండి పోరాటం జరుగుతుందని సిపిఎం అభ్యర్థులను గెలిపించాలన్నారు. చట్టసభల్లో ప్రజలకోసం పాటు పడే అభ్యర్థులు ఉంటే ప్రజాసమస్యలు పరిష్కారం అవుతాయని సిపిఎం మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, నాయకులు ఎన్ యోగేశ్వరరావు, బి అమ్మిరెడ్డి, సిహెచ్ పోతురాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

నగరాలులో జయలక్ష్మి హోండా నూతన షోరం ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక నగరాలులో హోండా కంపెనీ వారి నూతన ద్విచక్ర వాహన షోరూం 'హోండా బిగ్‌వింగ్' బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో బిగ్‌వింగ్ ప్రతినిధులు ఆదర్శ్, దేభర్గ్యదత్త, ఎండి నాగరయ్య, సిఇఒ, యుగంధర్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. షోరూం వర్క్‌షాప్‌ను గుంటూరు నగర 2వీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రామకృష్ణ ప్రారంభించారు. ఈ షోరూంలో నేటి యువతకు కావాల్సిన 300 సిసి నుండి 500 సిసి వరకూ వివిధ రకాల మోడల్స్ అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రారంభోత్సవ ఆఫర్ కింద 18-25 ఏళ్ల వయస్సు నిండిన వారికి రూ.12500లు డిస్కౌంట్ ఇస్తున్నామని, ఈ ఆఫర్ మార్చి 31 వరకు మాత్రమే ఉంటుందన్నారు.




కెఎల్‌యులో పిల్లల మానసిక వైద్యకేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

చిన్న వయసులో పిల్లల్లో తలెత్తే మానసిక అనారోగ్య సమస్యలకు పరిష్కారం చూపేందుకు కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో పిల్లల మానసిక వైద్య కేంద్రాన్ని (చైల్డ్ ఆటిజం కేర్ సెంటర్) ఏర్పాటు చేసినట్లు కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ఉపాధ్యక్షులు కోనేరు రాజా హరీన్ బుధవారం తెలిపారు. అమెరికాకు చెందిన ఎర్లీ ఆటిజం సర్వీస్ (ఇఎఎస్)అనే సంస్థ సహకారంతో తాము ఈ కేంద్రాన్ని నడుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎపిలో మొట్టమొదటిసారిగా అమెరికా టెక్నాలజీతో ఆటిజం కేర్ సెంటర్‌ను ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. ఏడాదిన్నర వయస్సు నుండి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలకు తమ వర్శిటీలో సంరక్షణ, థెరపీ ద్వారా పిల్లలు, తల్లి తండ్రుల మీద ఆధారపడకుండా తమ పనులను తాము సేచ్ఛగా చేసుకునే విధంగా పిల్లల మానసిక స్థితి మెరుగు పరచడానికి ప్రత్యేక థెరపిస్టులతో శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. విజయవాడ, గుంటూరు పరిసర ప్రాంతాల్లో ఉన్న గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లల్లో ఉండే పలు రకాల మార్పులను తగిన సమయంలో గుర్తించి వారికి థెరపీ ద్వారా చికిత్స అందిస్తే పిల్లలు వీలైనంత త్వరగా సాదారణ స్థితికి చేరుకుంటారని అన్నారు. ఎర్లీ ఆటిజం సర్వీస్ క్లినికల్ డైరెక్టర్ సాత్నం అగస్యా మాట్లాడుతూ కరోనా రెండవ దశ తరువాత పుడుతున్న పిల్లల్లో మానసిక ఆరోగ్యం సరిగా లేని వారిని ఎక్కువ శాతం గుర్తించడం జరిగిందన్నారు. పిల్లల వయసును బట్టి వారికి దశల వారీగా థెరపీ నిర్వహిస్తున్నామన్నారు. కెఎల్ యు - ఇఎఎస్ అనే రెండు సంస్థలు సంయుక్తంగా ఆటిజంపై పరిశోధనను అభివృద్ధి చేస్తున్నాయని అన్నారు. గుంటూరు మరియు విజయ వాడలోని పలువురు మానసిక వైద్యులు, తల్లిదండ్రులు ఆయా కళాశాలల విద్యార్థులతో ముందస్తుగా రోగ నిర్ధారణ కోసం అవగాహన కార్యక్రమాలను నిర్వహి స్తున్నట్లు వెల్లడించారు. ప్రొఫెసర్ చాన్సులర్ డాక్టర్ కే ఎస్ జగన్నాథరావు మాట్లాడుతూ ఇండియన్ జర్నల్ ఆఫ్ పీడియాట్రిక్స్‌లో ప్రచురించబడిన 2021లో జరిపిన అధ్యయనం ప్రకారం భారతదేశంలో ఆటిజం యొక్క ప్రాభల్యం ప్రతి 68 మంది పిల్లలలో ఒకరు ఉన్నట్లు అంచనా వేయబడిందన్నారు. బాలికల కంటే అబ్బాయిలు సాధారణంగా మానసిక అనారోగ్యం బారిన పడుతున్నారని పేర్కొన్నారు. మగ-ఆడలో సుమారుగా 3:1 నిష్పత్తిలో ఉంటుందన్నారు. వివరాల కోసం యుఎస్ఎలో అభివృద్ధి చేయబడిన టెక్నాలజీతో ఆంధ్రప్రదేశ్‌లో మొదటి ఈ థెరపీ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. చికిత్స వివరాల కోసం ఇఎఎస్-కెఎల్‌యు జాయింట్ సెంటర్ ఆఫ్ ఆటిజం క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ సత్నాం - 96067 52551 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో విసి డాక్టర్ జి పార్థసారథి వర్మ, ప్రొఫెసర్ డాక్టర్ ఎవిఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్ వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



పిల్లల కు థెరపీ నిర్వహిస్తున్న సత్నం అగస్య



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ జగన్నాథరావు తదితరులు